మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 76 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

శనివారం 08 జూన్ 2024

## కాళేశ్వరం మరమ్మతు పనులు

# వేగం పెంచండి



- వర్షాలకు ముందే పనులన్నీ ముగించాలి
- నిర్మాణ సంస్థలకు మంత్రి ఉత్తమ్ కుమార్ ఆదేశం
- అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల పరిశీలన
- 94 వేల కోట్లతో కట్టినా పనికిరాకుండా పోయిందని వెల్లడి

భూపాలపల్లి/పెద్దపల్లి,జూన్7 (ప్రజా మంటలు): కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బ తిన్న చోట్ల మరమ్మతు పనులను వేగవంతం చేయాలని నిర్మాణ సంస్థలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల పరిశీలనకు మంత్రి ఉత్తమ్ వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వల్ల కాళేశ్వరంపై రివ్యూ జరగలేదు. భారాస హయాంలోనే మేడిగడ్డ కుంగింది. రూ.94 వేల కోట్లు అప్పు చేసి కట్టిన ప్రాజెక్టు

మిగతా 2లో..



## సంకీర్ణ సర్కారుకు
# మోడీ నేతృత్వం

### మద్దతు లేఖలు రాష్ట్రపతికి అందజేత
### ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని వినతి
### ఆదివారం నాటి ప్రమాణానికి రాష్ట్రపతి ఆమోదం
### మూడోసారి ప్రమాణానికి సిద్ధం.. మంత్రివర్గ కూర్పుపై కసరత్తు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నికైన నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం ప్రధానిగా ప్రమాణం చేయనున్నారు. వరుసగా మూడోసారి ఆయన ప్రధాని బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఎన్‌డిఎ భేటీ తరవాత శుక్రవారం సాయంత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మోడీ కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా తనను లోక్ సభ పక్షనేతగా ఎన్డీయే మిత్రపక్షాలు ఎన్నుకున్న తీర్మానాన్ని రాష్ట్రపతికి అందజేశారు. మోదీ వెంట ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు ఉన్నారు. తమ కూటమికి మద్దతు ఇస్తోన్న పార్టీల లేఖలు, కొత్తగా ఎంపికైన మొత్తం ఎంపీల జాబితాను రాష్ట్రపతికి మోదీ అందించారు. ఈ క్రమంలో కేంద్రంలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని మోదీని రాష్ట్రపతి ఆహ్వానించారు. మోదీకి రాష్ట్రపతి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఓ జ్ఞాపికను

మిగతా 2లో..

## పిడుగుపాట్లకు 9 మంది మృతి

### తెలంగాణలో నైరుతి ప్రభావంతో వర్షాలు
### రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో వానలు

హైదరాబాద్, జూన్ 7 (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పిడుగుపాటుకు 9మంది మృతి చెందారు. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలకు ఒక్క మెదక్ జిల్లాలోనే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. నైరుతి రుతు పవనాల ప్రభావంతో తెలంగాణ మొత్తం

మిగతా 2లో..



### ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులకు
## రాష్ట్ర సర్కార్ గ్రీన్ సిగ్నల్

### గతంలో ఎక్కడ ఆగిందో అక్కడినుంచే ప్రారంభం
### టెట్‌తో సంబంధం లేకుండానే పదోన్నతులు



హైదరాబాద్, జూన్7 (ప్రజా మంటలు): ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రం విడుదల చేసింది. ఈ నెల 8 నుంచి ఉపాధ్యాయుల బదిలీ, పదో న్నతుల పక్రియ ప్రారంభం కానుంది. పదవీ విరమణకు 3 ఏండ్ల లోపు ఉన్న వారికి తప్పనిసరి బదిలీ నుంచి మినహాయింపు ఇవ్వ నున్నారు. మల్టీ జోన్ 1లో శనివారం

మిగతా 2లో..

## మల్లన్నకే జై కొట్టిన పట్టభద్రులు

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుపు



నల్గొండ/వరంగల్ జూన్7 (ప్రజా మంటలు): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకే పట్టభద్రులు పట్టంకట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఎలిమినేషన్‌తో ఘన విజయం సాధించారు. మూడు రోజులుగా సాగిన కౌంటింగ్ ప్రక్రియలో.. మొదటి ప్రాధాన్యత, రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో 43 మందితో పాటు బీజేపీ అభ్యర్థిని కూడా ఎలిమినేట్ చేయగా.. చివరికి బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డి కూడా ఎలిమినేషన్ కావడంతో చివరికి తీన్మార్ మలన్నన్నే విజయం వరించింది.రెండో ప్రాధాన్యత ఓటులో మల్లన్నకు రాకేశ్ రెడ్డి గట్టి పోటీ ఇచ్చారు. మ్యాజిక్ ఫిగర్ చేరుకోకపోయినా మల్లన్న విజయం సాధించటం గమనార్హం. అయితే.. ముందు నుంచీ తీన్మార్ మల్లన్న ఆధిక్యం చూపించారు. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి ఏ రౌండ్‌లోనూ పోటీ ఇవ్వలేకపోయారు. చివరకు రాకేశ్ రెడ్డి ఎలిమినేషన్ కావడంతోనే తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమైంది. ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రకటన చేశారు. దీంతో శుక్రవారం రాత్రి కౌంటింగ్ సెంటర్ దగ్గరకి భారీగా కాంగ్రెస్ పార్టీ క్యాడర్, అభిమానులు చేరుకుని, బాణసంచాలు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు.

## ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్

### ఐదుగురు మావోయిస్టులు మృతి
### ముగ్గురు జవాన్లకు గాయాలు

గోబెల్ అటవీ ప్రాంతంలో ఘటన

నారాయణ్‌పూర్ (జనంసాక్షి) : దండకారణ్యం మరోసారి తుపాకుల మోతతో దద్దరిల్లింది. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్– దంతెవాడ సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో

మిగతా 2లో..





## 21 వరకు కవిత జ్యుడిషయల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ జూన్7 (ప్రజా మంటలు): ఢిల్లీ మద్యం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు జ్యుడీషియల్ కస్టడీ కోరుతూ

మిగతా 2లో..

## ప్రజా నాడి




## కాంగ్రెస్ గూటికి చేరుకున్న విశాల్ పాటిల్

### వందకు చేరిన కాంగ్రెస్ సీట్ల సంఖ్య - స్వాగతించిన మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): భారత్‌లో రాజకీయ సమీకరణాలు రోజురోజుకి మారుతున్నాయి. తాజాగా మహారాష్ట్రలో రెబల్ ఎంపి విశాల్ పాటిల్ తిరిగి తన సొంత పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ 99 సీట్లను గెలుచుకున్న సంగతి తెలిసిందే. విశాల్ పాటిల్ మద్దతుతో లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపిల సంఖ్య 100కి చేరింది. వికాస్ పాటిల్ మద్దతును స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. విశాల్ పాటిల్, విశ్వజిత్ కదమ్‌లు గురువారం కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను కలిశారని, పార్టీకి తాను మద్దతు ప్రకటిస్తున్నట్లు విశాల్ పాటిల్ తెలిపారని ఖర్గే వెల్లడించారు. మహారాష్ట్ర వికాస్ అఘాడీ (ఎంవిఎ) కూటమిలో సీట్ల ఒప్పందంలో భాగంగా మహారాష్ట్రలోని సాంగ్లీ నియోజకవర్గం శివసేన యుబిటికి కేటాయించారు. దీంతో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వసంత్‌దాదా మనవడైన విశాల్ పాటిల్ కాంగ్రెస్‌పై తిరుగుబాటు ప్రకటించారు. సాంగ్లీ నియోజకవర్గం నుండి స్వతంత్య అభ్యర్థిగా బరిలోకి దిగారు. బిజెపి అభ్యర్థి సంజరు కాకా పాటిల్‌పై విజయం సాధించారు.

మిగతా 2లో..

## విమానాశ్రయంలో 9 కిలోల బంగారం స్వాధీనం



బెంగళూరు (ప్రజా మంటలు): బెంగళూరులోని విమానాశ్రయాల్లో రెండు వేర్వేరు ఘటనల్లో కస్టమ్స్ అధికారులు 9 కిలోల బంగారాన్ని పట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఉదయం 6.29 కోట్ల విలువైన 9 కిలోల బంగారాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) స్వాధీనం చేసుకున్నట్లుగా గురువారం అధికారులు వెల్లడించారు.బ్యాంకాక్ నుంచి బెంగళూర్( వస్తున్న విమానంలో అక్రమంగా బంగారాన్నితరలిస్తున్నట్లుగా అధికారులకు సమాచారం అందింది.

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

## విమానాశ్రయంలో 9 కిలోల బంగారం స్వాధీనం



దీంతో వారు అప్రమత్తమై బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన థాయ్ ఎయిర్‌వేస్ విమానంలో తనిఖీలు నిర్వహించారు. విమానంలోని ఓ మూలలో దాచిన ఓ హ్యాండ్ బ్యాగులో రూ.4.77 కోట్ల విలువైన 6.834 కిలోల బంగారు బిస్కెట్లను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాగ్ లోపల ఉన్న ఆధారాల ద్వారా దానిని విమానంలో వదిలివేసిన ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకున్నారు. ఈ విచారణలో భాగంగా బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లుగా వారు అంగీకరించారన్నారు.మరో ఘటనలో బెంగళూరులోని అంతర్జాతీయ విమానాశ్రయంలో దుబాయ్‌నుంచి వచ్చిన ఎమిరేట్స్ విమానంలో రూ.1.52కోట్ల విలువైన 2.18 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని విమానం ముందు భాగంలోని లావేటరీలో దాచి తరలిస్తున్నారని అధికారులు తెలిపారు.

## పిడుగుపాట్లకు 9 మంది మృతి

మీద ఉరుములు పిడుగులతో కూడిన వానలు పడటంతో, ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పిడుగుపాటుతో నలుగురు మరణించారు. మెదక్ జిల్లా హవేళిఘన్‌పూర్ మండలంలోని శమ్నాపూర్ గ్రామానికి చెందిన శేట్టిబోయిన సిద్దయ్య (51), వొడంగుల నందు (22) దగ్గరలోని అడవిలోకి బుధవారం సాయంత్రం పొయ్యిల కట్టెలు తేవడానికి వెళ్లారు. వారి ఇద్దరి మీద పిడుగు పడటంతో, ఇద్దరూ కూడా అక్కడిక్కడే మరణించారు. గ్రామస్థులు ఎంత వెతికినా బుధవారం రాత్రి వరకు వారి ఆచూకీ దొరక లేదు. గురువారం ఉదయం గ్రామస్తులంతా కలిసి వెతకగా, సిద్దయ్య, నందు ఇద్దరు కూడా విగతజీవులుగా అడవిలో ఉన్న చిన్న గుట్ట పైన కనిపించారు. మెదక్ జిల్లాలోని కౌడిపల్లి మండలంలోని పీర్లతండాకి చెందిన దలావత్ గెమ్యా నాయక్ (55), తన గ్రామా శివారున పొలంలో పనిచేస్తుండగా ఉడుములు పిడుగులతో భారీ వర్షం పడటంతో, తడవకుండా ఉండటానికి చెట్టు కిందికి పరిగెత్తాడు. చెట్టు మీద పిడుగు పడటంతో, గెమ్యా నాయక్ అక్కడిక్కక్కడే మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలో రైతు కూలి మరణించాడు. పక్కనే ఉన్న కర్నాటకకు చెందిన బిల్లిపురం గోపాల్ (40), కోహిర్ గ్రామంలో కూలికి వచ్చాడు. తాను పొలంలో పనిచేస్తుండగా, ఉరుములు పిడుగులతో కూడిన భారీ వర్షం రావటంతో, తాను చెట్టు కిందికి పరిగెత్తుతుండగా పిడుగుపడి అక్కడిక్కక్కడే మరణించాడు. పొట్టకూటి కోసం కూలికి వచ్చిన వ్యక్తి, పిడుగుపడి మరణించడంతో కుటుంబం విషాదంలో మునిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లలో నలుగురు చనిపోగా, నాగర్ కర్నూల్ జిల్లాలో మరొకరు మృతి చెందారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలానికి చెందిన భార్యాభర్తలు, అనక సంతోష్ (26), భార్య స్వప్న (22) తమ గ్రామమమైన డొంకర్ గాం శివారులో వారి పొలములో పనిచేస్తుండగా వారిపై పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందారు. నిర్మల్ జిల్లాలోని దిలావర్పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన మూదరపు ప్రవీణ్ (26) పిడుగు పడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఇదే జిల్లా తానూరు మండలం ఎల్వత్ కి చెందిన మాగీర్వాడ్ శ్రీ (13) అనే అబ్బాయి కూడా మృతి చెందాడు. నాగర్ కర్నూల్ జిల్లాలో వెల్దండ గ్రామంలోని దిల్వార్పూర్ కు చెందిన జంగమ్మ (40) తన భర్త కృష్ణయ్య, తల్లి జంగిలి ఈదమ్మతో కలిసి వారి పొలంలో పత్తి విత్తనాలు పెడుతుండంగా, వారి పై పిడుగుపడి జంగమ్మ అక్కడిక్కడే మృతి చెందింది. కృష్ణయ్య, ఈదమ్మ కూడా తీవ్ర గాయాలతో, అపస్మారకస్థితిలోకి వెళ్లారు. వారిని దగ్గర్లోని ఆసుపత్రికి తరలించి, అక్కడినుండి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించారు.



## సంకీర్ణ సర్కారుకు మోడీ నేతృత్వం

బహూకరించారు. దేశానికి మరింత సేవ చేయాలని ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారని.. దేశ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తామని మోదీ అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతిచ్చే ఎంపీల జాబితాను రాష్ట్రపతికి అందించామని.. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరినట్లు చెప్పారు. ఈ నెల 9న ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు రాష్ట్రపతికి తెలియజేశామని వెల్లడించారు.ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎన్డీయే కూటమి నేతలు శుక్రవారం ఉదయం కీలక సమావేశం నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్,ఏక్‌నాథ్ షిండే, చిరాగ్ పాశ్వాన్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ ఎన్డీయే పక్షనేతగా మోదీని ప్రతిపాదించగా ఎంపీలంతా ఆమోదించారు. ఈ క్రమంలో ఆయన మూడోసారి ప్రధానిగా ఈ నెల 9న కర్తవ్యపథ్‌లో ప్రమాణం చేయనున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు మోదీ బాధ్యతలు చేపట్టేలా ముహూర్తం ఖరారు చేశారు. ఆ రోజు ప్రధానితో పాటు కొందరు మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతిచ్చే ఎంపీల జాబితాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు అందజేశామని ప్రధాని మోదీ తెలిపారు. ఆజాదీ కా అమృత్ ఉత్సవాల తర్వాత జరిగిన మొదటి ఎన్నికలు ఇవి. దేశానికి మరింత సేవ చేయాలని ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు. దేశ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తాం. ప్రజల ఆకాంక్షల మేరకు మరింత ఉత్సాహంగా పని చేస్తాం. ఇవాళ ఉదయమే ఎన్డీయే నేతలంతా కలిసి చర్చించాం. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని రాష్ట్రపతిని కోరాం. ఆదివారం ప్రమాణ స్వీకారం చేస్తామని రాష్ట్రపతికి తెలియజేశాం అని మోదీ తెలిపారు. మోడీ ప్రమాణ స్వీకార ఈ కార్యక్రమానికి రావాలని పలువురు దక్షిణాసియా నేతలకు ఆహ్వానాలు అందాయి. మాల్దీవ్స్ ప్రెసిడెంట్ మహమ్మద్ ముయిజ్జును కూడా పిలిచారు. మయిజ్జు మోదీకి అభినందనలు కూడా తెలిపారు. ఆయన ఆ ఆహ్వానాన్ని స్వీకరించారు. గతకొంత కాలంగా మయిజ్జు చైనా దేశానికి అనుకూలంగా పని చేస్తూ.. భారత్ కు వ్యతిరేకంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు కూడా దూరమవుతున్నట్లు కనిపిస్తుంది. శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, మారిషస్ దేశాల నేతలకు ప్రమాణస్వీకారానికి రావాల్సిందిగా ఆహ్వానాలు అందాయి. ప్రమాణ స్వీకారోత్సవానికి మోదీ ఆయనను ఆహ్వానించినట్లు శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే కార్యాలయ మీడియా విభాగం తెలిపింది. విక్రమసింఘే ఆహ్వానాన్ని అంగీకరించారని, ఎన్నికల విజయంపై మోదీకి ఫోన్‌లో అభినందనలు తెలిపారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, నేపాల్ నేత పుష్ప కమల్ దహల్ ప్రచండ కూడా వేడుకకు హాజరు కావాల్సిందిగా కోరారు.

మద్దతు తెలిపిన ఎన్‌డిఎ నేతలు బాబు, నితీశ్

ఎన్డీయే పక్ష నేతగా నరేంద్ర మోడీ మూడోసారి ఎన్నికయ్యాడు.పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్డీయే పార్లమెంటరీ పక్ష సమావేశంలో ఎన్డీయే కూటమి ఈ మేరకు మోడీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఎన్డీయే పక్ష నేతగా మోడీ పేరును రాజనాథ్ సింగ్ ప్రతిపాదించగా అమిత్ షా, గడ్కరీ, కుమారస్వామి, చంద్రబాబు,నితీశ్ కుమార్ తదితర ఎన్డీఏ నేతలు బలపరిచారు. ఈ సమావేశానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా హాజరయ్యారు. ఈ ప్రతిపాదనకు నూతన ఎంపీలు అందరూ ఆమోదం తెలిపారు. దీంతో మూడోసారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగుమమైంది.

ఎన్‌డీఎ అంటేనే సుపరిపాలన : మోడీ

ఎన్డీయే అంటేనే సుపరిపాలన. మన కూటమి అసలైన భారత్ స్ఫూర్తిని చాటుతుంది. మనది అత్యంత విజయవంతమైన భాగస్వామ్యం' అని నరేంద్రమోదీ అన్నారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం ఢిల్లీలో శుక్రవారం జరిగింది. ఇందులో తమ లోక్‌సభా పక్ష నేతగా మోదీని ఎన్డీయే నేతలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిత్రపక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ప్రదర్శనపై హర్షం వ్యక్తం చేశారు. కూటమిలో పరస్పర విశ్వాసమే ప్రధానం. అన్ని అంశాల్లో ఏకగ్రీవ నిర్ణయాలే లక్ష్యం' అని మోదీ అన్నారు. ఇక ఔఆం అంటే 'న్యూ ఇండియా, డెవలప్‌డ్ ఇండియా, ఆస్పిరేషనల్ ఇండియా' అని కొత్త అర్థం చెప్పారు. దక్షిణాది ప్రజలు ఎన్డీయేను ఆదరించారు. కర్ణాటక, తెలంగాణలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అతి తక్కువ కాలంలోనే అక్కడి ప్రభుత్వాలు ప్రజల విశ్వాసం కోల్పోయాయని చెప్పారు. విపక్షాలు పార్లమెంట్‌లోకి వచ్చి చర్చల్లో పాల్గొంటాయని భావిస్తున్నానని మోదీ చురకలంటించారు.

## 21 వరకు కవిత జ్యూడిషయల్ కస్టడీ పొడిగింపు

శుక్రవారం సీబీఐ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. దీంతో మరోసారి కవితకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించింది. జూన్ 21 వరకు రౌస్ అవెన్యూ కోర్టు కవితకు కస్టడీని పొడిగించింది. తదుపరి విచారణను జూన్ 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. అదే రోజు సీబీఐ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ జరపనున్నది. సీబీఐ కేసులో కవితపై దాఖలైన చార్జిషీట్‌ను కోర్టు విచారణకు తీసుకున్నది. తాను చదువుకోవడానికి కొత్తగా 9 పుస్తకాలు కావాలని కోర్టును కవిత కోరింది. కవిత అభ్యర్థనను రౌస్ అవెన్యూ కోర్టు అంగీకరించింది.

### ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులకు
## రాష్ట్ర సర్కార్ గ్రీన్ సిగ్నల్

నుంచి ఈ నెల 22వ తేదీ వరకు, మల్టీ జోన్ 2లో రేపట్నుంచి ఈ నెల 30 వరకు బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నారు. కోర్టు కేసులతో గతంలో ఎక్కడ పక్రియ ఆగిపోయిందో అక్కడి నుంచి బదిలీల పక్రియ ప్రారంభం కానుంది. టెట్‌తో సంబంధం లేకుండానే ఉపాధ్యాయుల పదోన్నతుల పక్రియ చేపట్టనున్నట్టు విద్యాశాఖ స్పష్టంచేసింది.

గతేడాదిలోనే ప్రారంభం..

గతేడాదిలోనే ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను చేపట్టారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియకు కసరత్తు చేశారు. అయితే ప్రమోషన్లకు టెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరని హైకోర్టు తీర్పునివ్వటంతో ప్రక్రియకు బ్రేకులు పడినట్లు అయింది. చాలా మంది టీచర్లకు టెట్ లేకపోవటంతో చాలా మంది గందరగోళానికి గురయ్యారు. మరోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన జీవో 317తో ఇతర జిల్లాల నుంచి టీచర్లు రావటంతో తమ సీనియార్టీ దెబ్బతిని నష్టపోతున్నామని రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు టీచర్లు హైకోర్టును ఆశ్రయించారు. వీటికితోడు పలు అంశాలపై గందరగోళం నెలకొనటంతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. దీనికితోడు కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో పాటు ఎన్నికల కోడ్ రావటంతో ముందుకు కదల్లేదు. జూన్ 6వ తేదీతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్‌ను ఎత్తివేశారు. దీంతో ప్రభుత్వం టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా విద్యాశాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది.

## ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టులు మృతి చెందగా, ముగ్గురు జవాన్లు గాయపడ్డట్లు సమాచారం. మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం మేరకు భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా నక్సలైట్లు తారసపడటంతో ఇరు వర్గాలు కాల్పులకు దిగాయి. ఈ ఘటనలో ఐదుగురు మావోయిస్టులు మరణించగా.. పలువురు జవాన్లు గాయపడ్డట్లు తెలుస్తోంది. పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నట్లు సమాచారం. మృతిచెందిన మావోయిస్టులు దంతెవాడ, బస్తర్, నారాయణ్‌పూర్, కొండగావ్ జిల్లాలకు చెందినవారిగా గుర్తించారు. ఇటీవల దండకారణ్యంలో వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతోన్న విషయం తెలిసిందే. గడిచిన మూడు నెలల్లోనే జరిగిన ఎన్‌కౌంటర్లలో దాదాపు 120 మందికిపైగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మే 23న నారాయణ్‌పూర్ బీజాపూర్, మే 10న అదే ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్లు జరిగాయి.

## కాంగ్రెస్ గూటికి చేరుకున్న విశాల్ పాటిల్

సీట్ల ఒప్పందానికి ముందే శివసేన వర్గానికి చెందిన ఉద్దవ్ థాకరే సాంగ్లీ నియోజకవర్గ అభ్యర్థిని ప్రకటించడం వివాదానికి దారితీసింది. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాల్సిందిగా కాంగ్రెస్ పలుమార్లు ఉద్ధవ్ థాకరేను కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో విశాల్ పాటిల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. మరో నేత పప్పూయాదవ్ కూడా కాంగ్రెస్‌కు మద్దతు తెలపనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు పప్పు యాదవ్ తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. అయితే సీటల ఒప్పందంలో భాగంగా పూర్ణియా సీటు ఆర్‌జెడికి కేటాయించారు. దీంతో పప్పు యాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

## హైదరాబాద్‌కు 'ఎల్లో అలర్ట్'..
### - భారీ వర్షం కురిసే అవకాశం



హైదరాబాద్, (ప్రజా మంటలు):

ఉపరితల ఆవర్తనం, షియర్ జోన్ ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని మరో నాలుగు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరిస్తాయని వాతావరణశాఖ అధికారిణి శ్రావణి తెలిపారు.నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదలడం, ఉపరితల ఆవర్తనం, షియర్ జోన్ ప్రభావంతో రెండ్రోజుల పాటు దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు.శుక్రవారం జీహెచ్‌ఎంసీ పరిధితో పాటు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదరుగు గాలుల వీచే అవకాశముందని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది. ఇప్పటికే రంగారెడ్డి, వికారాబాద్ పాటు నగరంలోని మియాపూర్, నిజాంపేట్ ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. భారీ వర్షం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే.. 040-21111111, 90001136675కు కాల్ చేయాలని సూచించింది.

# కాళేశ్వరం మరమ్మతు పనులు వేగం



కుంగిపోతే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానికి వడ్డీ కట్టాల్సి వస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీని సంప్రదించి పరిశీలన చేయమని కోరాం. నిపుణుల కమిటీ కొన్ని సూచనలు చేసింది. మేడిగడ్డ కుంగిన వెంటనే గేట్లు ఎత్తి ఉంటే ఇంత డ్యామేజీ జరిగేది కాదని తేల్చింది. దెబ్బతిన్న చోట్ల కొన్ని రిపేర్లు చేసి అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల మూడు బ్యారేజీల గేట్లు ఎత్తిపెట్టాలని చెప్పింది. ఆ పనుల పరిశీలన చేయడానికి వచ్చా. మేడిగడ్డ, అన్నారం వద్ద పనులు వేగంగా జరుగుతున్నాయి. సుందిళ్ల బ్యారేజీ పనులు నెమ్మదిగా జరుగుతుండటంతో వేగవంతం చేయాలని చెప్పాం. వర్షాలకు ముందే పనులు పూర్తి కావాలని నిర్మాణ సంస్థలను ఆదేశించాం. తుమ్మడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మిస్తాం అని ఉత్తమ్ చెప్పారు. రిపేర్లు చేసినా బ్యారేజీల గేట్లు ఎత్తాల్సిందే నన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. కాళేశ్వరంలోని బ్యారేజీలను పరిశీలించిన ఉత్తమ్.. ఎన్డీఎస్ఏ సూచనల మేరకే మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. నిపుణుల కమిటీ సూచనలు ఇచ్చే వరకు గేట్లు ఓపెన్ చేస్తామని చెప్పారు. కేసీఆరేమో నీళ్లు స్టోరేజ్ చేయొచ్చని ప్రచారం చేస్తున్నారు.. ఎన్డీఎస్ఏ వద్దంటోందని అన్నారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజ్ లో పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు ఉత్తమ్. సుందిళ్లలో నవయుగ కంపెనీ పనుల్లో ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. పనులు వేగవంతం చేయాలని నవయుగ కంపెనీ ప్రతినిధులను హెచ్చరించామన్నారు. కాంట్రాక్టు నిర్మాణ సంస్థల ఖర్చుతోనే ప్రస్తుతం తాత్కాలిక మరమ్మత్తులు జరుగుతున్నాయని చెప్పారు. ఎల్లంపల్లికి నీటిని ఎత్తి పోయవచ్చని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే మేడిగడ్డ కుంగిందన్నారు. పాలమూరు రంగారెడ్డికి 20 వేల కోట్లు ఖర్చు పెట్టి ఎకరాకు నీళ్ళియ్యలేదన్నారు. ఎన్నికల కోడ్ ఉండటంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై రివ్యూ చేయలేదన్నారు ఉత్తమ్. కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా ఉంది.. 90వేల కోట్లకు వడ్డీ చెల్లిస్తున్నామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఫలితాలు చూసిన తర్వాత కేసీఆర్ గురించి మాట్లాడుకోడం వేస్ట్ అని అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు నీళ్లు వచ్చే ప్రాజెక్ట్ చేపట్టడతామని చెప్పారు. సుందిళ్ళ బ్యారేజ్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, గుత్తేదారు ఏజెన్సీలను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మించిన మూడు బ్యారేజ్ ల సందర్శనలో భాగంగా శుక్రవారం తొలుత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంథని మండలం సిరిపురం గ్రామం వద్ద నిర్మించిన సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ ను సందర్శించారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ ను ఆసాంతం మంత్రి పరిశీలించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన సూచనల ప్రకారం మరమ్మత్తు, పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తి కావాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిలో ఆశించిన మేర ఫలితం కనపడటం లేదని, అవసరమైన మేర అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని మంత్రి అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. బ్యారేజ్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని, ప్రతి పనికి సంబంధించి నిర్దేశిత సమయాన్ని నిర్దేశించుకొని దానిలోపు ఆ పని పూర్తి చేసే విధంగా ఏజెన్సీలు పనిచేయాలని, ఏ పని ఎప్పటి వరకు పూర్తవుతుందో కాగితంపై షెడ్యూల్ రూపొందించి అందించాలని మంత్రి ఆదేశించారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ సమీపంలో గల పంప్ హౌస్ సంరక్షణ కోసం నిర్మిస్తున్న కట్ట వల్ల స్థానికులకు కలిగే నష్టాన్ని స్థానిక మంత్రివర్యులు తో కలిసి అంచనా వేసి వాటి పరిష్కార మార్గాలను సూచిస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి సంబంధిత ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు. ప్రాజెక్టు ఈ.ఎన్.సి అనిల్ కుమార్ జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న పనుల వివరాలను మంత్రికి వివరించారు. రాబోయే వానాకాలంలో మూడు బ్యారేజీల సంరక్షణకు, తదుపరి ఎటువంటి డ్యామేజీ జరగకుండా పనులు చేపట్టామని ఈఎన్సీ తెలిపారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ వద్ద కొట్టుకుపోయిన ఇసుక పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం జియో ఫిజికల్, జియో టెక్నికల్ జనరల్ పరీక్షలు నిర్వహించి కొట్టుకుపోయిన ఇసుకను అంచనా వేసి వాటిని పునరుద్ధరించి బ్యారేజ్ ఎటువంటి మరమ్మత్తుకు గురికాకుండా సంరక్షణ చర్యలు చేపడుతున్నామని, మంత్రి ఆదేశాల మేరకు పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేసి రాబోయే పది రోజుల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామని ఈఎన్సీ అన్నారు. అనంతరం మీడియాతో రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయినప్పటికి నిర్లక్ష్యం వహిస్తూ ఎటువంటి మరమ్మత్తులు చేపట్టలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 3 బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, దేశంలోనే పార్లమెంట్ ద్వారా ఏర్పాటు చేసిన అత్యున్నత సంస్థ అయిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అధారిటీలకు బాధ్యత అప్పగించడం జరిగిందని అన్నారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన మధ్యంతర నివేదిక ప్రకారం రాబోయే వానా కాలంలో మూడు బ్యారేజీల సంరక్షణ కోసం పనులు చేపట్టామని, క్షేత్రస్థాయిలో బ్యారేజీలను పరిశీలించి ఆ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా సంబంధిత ఏజెన్సీలను, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించడం జరిగిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను పరిశీలించేందుకు తమ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ జడ్జ్ జస్టిస్ ఆధ్వర్యంలో వేసిన జ్యుడీషియల్ కమిషన్ సైతం ప్రాజెక్టును సందర్శిస్తుందని మంత్రి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీని తప్పనిసరిగా నిర్మిస్తామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం భూపాల్ పల్లి జిల్లాలో ఉన్న అన్నారం(సరస్వతి) బ్యారేజీ సందర్శనకు మంత్రి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈ.ఎన్.సి జనరల్ జి.అనిల్ కుమార్, ఎస్.ఈ.ఏం. కరుణాకర్, ఈ.ఈ. సర్దార్ ఓంకార్ సింగ్, ఇతర నీటీ పారుదల అధికారులు, మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమా సురేష్ రెడ్డి , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రధాని అయ్యే అర్హత లేదు

## ఎన్డీయేను మెజారిటీ ప్రజలు తిరస్కరించారు

## రాజీవ్‌గాంధీని స్ఫూర్తిగా తీసుకోవాలని సచిన్ పైలట్ హితవు

న్యూఢిల్లీ,జూన్7 (ప్రజా మంటలు):



2024 లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలపై బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని, మెజార్టీ లేనందున మోడీ ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రావద్దని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ అన్నారు. 1989లో ఎన్నికలు జరిగినప్పుడు.. రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీకి సుమారు 200 సీట్లు వచ్చాయి. అప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేయమని రాజీవ్‌ని కోరగా.. ఆయన తిరస్కరించారు. ఎందుకని ప్రశ్నిస్తే.. ప్రభుత్వ ఏర్పాటు కావాల్సిన మెజారిటీ తమ పార్టీకి రాలేదని, ప్రజాతీర్పు అనుకూలంగా లేదని కారణాలు తెలిపారు. దాంతో.. కాంగ్రెస్ తర్వాత అత్యధిక సీట్లు సాధించిన పెద్ద పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా పిలుపువచ్చిందని సచిన్ పైలట్ పేర్కొన్నారు. ఇప్పుడు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏను ప్రజలు తిరస్కరించారని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయని.. కాబట్టి నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకూడదని సవాల్ ఉద్ఘాటించారు. మందిర్–మసీదు, హిందూ–ముస్లిం, మంగళసూత్రం అంటూ బీజేపీ చేసిన ఎన్నికల ప్రచారాన్ని దేశ ప్రజలు అంగీకరించలేదని సచిన్ పైలట్ తెలిపారు. ప్రతిపక్షాలను టార్గెట్ చేయడం, ముఖ్యమంత్రులను జైల్లో పెట్టడం, దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం వంటి వైఖరిని కేంద్ర ప్రభుత్వం అవలంబించిందని ఆరోపించారు. ఈ చర్యలన్నింటినీ ప్రజలు తిప్పికొట్టారని వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానాలో డబుల్ ఇంజిన్ సర్కార్ విఫలమైందని దుయ్యబట్టారు. ఈసారి తమ కాంగ్రెస్ పార్టీ సీట్ల సంఖ్య రెట్టింపు అయ్యిందని.. తమ మేనిఫెస్టోని, ప్రచారాన్ని ప్రజలు బాగా అర్థం చేసుకోగలిగారని వెల్లడించారు. ఇదే సమయంలో.. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభ్యర్థులకు సచిన్ పైలట్ ధన్యవాదాలు తెలిపారు. 1989లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 197 స్థానాలను కైవసం చేసుకుంది. అతిపెద్ద పార్టీగా అవతరించింది. కానీ.. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజారిటీ మాత్రం ఆ పార్టీకి దక్కలేదు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ తర్వాత జనతాదళ్ పార్టీ 143 స్థానాలను దక్కించుకుంది. రాజీవ్ గాంధీ వెనకడుగు వేయడంతో.. ఆ సమయంలో జేడీ పార్టీ అధ్యక్షుడు వీపీ సింగ్ ఇతర పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే.. ఆయన ప్రధానిగా 11 నెలలు మాత్రమే కొనసాగారు. 1989 డిసెంబర్ 2వ తేదీన ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన వీపీ సింగ్.. 1990 నవంబర్ 10వ తేదీన దిగిపోయారు.

# రాహుల్‌కు ఊరట

## పరువు నష్టం కేసులో ఉపశమనం

## బెయిల్ మంజూరు చేసిన కర్నాటక కోర్టు

బెంగళూరు, జూన్7 (ప్రజా మంటలు):



పరువునష్టం కలిగించే' ప్రకటనలు వేయించినందుకు బిజెపి కర్నాటక శాఖ దాఖలు చేసిన కేసు సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బెంగళూరులోని ప్రత్యేక కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రచురించిన ప్రకటనల్లో రాష్ట్రంలోని అప్పటి బిజెపి ప్రభుత్వం తన 2019- 2023 పాలనలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. పరువునష్టం కేసు సందర్భంగా కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఈ నెల 1న కోర్టుకు హాజరైనప్పుడు వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 7న కోర్టుకు తప్పనిసరిగా హాజరు కావాలని రాహుల్ గాంధీని న్యాయమూర్తి కెఎన్ శివకుమార్ ఆ రోజు ఆదేశించారు. గత రెండు విచారణలకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరినందుకు రాహుల్ గాంధీ శుక్రవారం క్షమాపణ తెలియజేశారు. కోర్టు ఆయన క్షమాపణను అంగీకరించి రూ. 75 లక్షల ష్యూరిటీతో బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీతో పాటు సిద్ధరామయ్య, శివకుమార్ కూడా కోర్టుకు హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్నాటకలోని అన్ని ప్రధాన స్రవంతి దినపత్రికల్లో నిరుడు మే 5న నిందితులు 'అవినీతి రేటు కార్డు', '40 శాతం కమిషన్ సర్కార్' శీర్షిక కింద జారీ చేసిన ప్రకటనల్లో తప్పుడు, నిర్లక్షపూరిత ఆరోపణలు చేశారని నిరుడు జూన్‌లో దాఖలు చేసిన ఫిర్యాదులో బిజెపి ఆరోపించింది. కెపిసిసి అధ్యక్ష హోదాలో శివకుమార్, శాసనసభలో అప్పటి ప్రతిపక్ష నాయకుని హోదాలో సిద్దరామయ్య ద్వారా కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) ఆ ప్రకటనలు జారీ చేసిందని బిజెపి తన ఫిర్యాదులో ఆరోపించింది. రాహుల్ గాంధీ ఆ 'పరువునష్టం కలిగించే ప్రకటన'ను తన సామాజిక మాధ్యమం 'ఎక్స్' పోస్ట్‌లో పొందుపరిచారని బిజెపి పేర్కొన్నది. రాహుల్ గాంధీ స్వయంగా కోర్టు ముందు హాజరైన తరువాత బిజెపి 'ఎక్స్' పోస్ట్‌లో వ్యాఖ్యానిస్తూ, 'నేషనల్ హెరాల్డ్ కేసులో బెయిల్‌పై విడుదలైన నిందితుడు రాహుల్ గాంధీ ! నమ్మ బెంగళూరుకు మీకు స్వాగతం. కర్నాటకలోని మా నేతలపై మీరు ఉపయోగించిన, ఇప్పటి వరకు మీరు రుజువు చేయలేకపోయిన తప్పుదారి పట్టించే, పరువునష్టం పూర్వక ప్రకటనలకు సంబంధించి భారతీయ చట్టాల పరిణామాలను అనుభవించేందుకు మీకు స్వాగతం పలుకుతున్నాం' అని పేర్కొన్నది.

# దౌత్య విధానాల్లో అది సహజమే..

## భారత్‌ను వెనకేసుకొచ్చిన అమెరికా..!

అమెరికా (ప్రజా మంటలు):



ఇరువురు దేశాధినేతలు పరస్పరం అభినందించుకోవడం దౌత్య విధానాల్లో అత్యంత సహజమైన ప్రక్రియ అని అమెరికా అభిప్రాయపడింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, తైవాన్ అధ్యక్షుడు లాయ్ చింగ్ తే పరస్పరం అభినందనలు తెలుపుకొన్నారు.దీనిపై చైనా తీవ్ర స్థాయిలో అభ్యంతరం తెలిపింది. తైవాన్ రాజకీయాలను భారత్ ప్రతిఘటించాలంటూ డిమాండ్ చేసింది. తాజాగా ఈ అంశంపై వాషింగ్టన్ స్పందించింది. అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూమిల్లర్ తన రోజువారీ ప్రెస్‌మీట్‌లో స్పందించారు. "దౌత్య రంగంలో అభినందన సందేశాలు సర్వసాధారణమే" అని పేర్కొన్నారు.చైనా ఆందోళనలపై మరోవైపు తైవాన్ కూడా స్పందించింది. ఆ దేశ విదేశాంగశాఖ స్పందిస్తూ "ఓ పక్క భారత్‌లో ఎన్నికలు పూర్తికావడంతో ప్రధాని మోదీ మళ్లీ ఎన్నికయ్యారు. ప్రపంచ నేతలు ఆయన్ను అభినందిస్తున్నారు. చైనా దీనిని రాజకీయ బెదిరింపులకు వాడుకొని తప్పుడు ప్రచారం చేస్తోంది. అంతర్జాతీయ సమాజాన్ని గందరగోళానికి గురిచేయడమే దీని లక్ష్యం. దాని నియంతృత్వ పాలన లక్షణాలను ఈ చర్య తెలియజేస్తోంది" అని పేర్కొంది.బుధవారం తైవాన్ అధ్యక్షుడు లాయ్ చింగ్ తే నుంచి ప్రధానికి అభినందన సందేశాలు వచ్చాయి. "ఎన్నికల విజయానికి ప్రధాని నరేంద్ర మోదీకి నా మనస్ఫూర్తి అభినందనలు. భారత్–తైవాన్ బంధాన్ని వేగంగా బలోపేతం చేసుకోవడంపై నేను దృష్టిపెట్టాను. ఇండో పసిఫిక్‌లో శాంతిని సుసంపన్నతను కాపాడేందుకు మా వాణిజ్య, సాంకేతిక సహకారాన్ని మరింత విస్తరించుకొంటాం" అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు మోదీ బదులిస్తూ.. "మీ హృదయ పూర్వక సందేశానికి కృతజ్ఞతలు. ఇతర దేశాలతో సన్నిహిత సంబంధాలను మేం కోరుకుంటాం. ఆర్థిక, సాంకేతిక రంగాల్లో పరస్పర ప్రయోజనాల కోసం మేం పనిచేస్తాం" అని పేర్కొన్నారు. అయితే, ఈ సంభాషణలపై బీజింగ్ అభ్యంతరం వ్యక్తంచేసింది. దీనిపై న్యూదిల్లీ వద్ద తమ నిరసన వ్యక్తంచేసినట్లు చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. తాజాగా భారత్ చర్యలకు అమెరికా నుంచి మద్దతు లభించింది.

# ధాన్యం ఉత్పత్తిలో అగ్రగామిగా రాష్ట్రం

## రాష్ట్రవ్యాప్తంగా 1.2 కోట్ల ఎకరాల్లో ధాన్యం ఉత్పత్తి

## ప్రపంచ వరి సదస్సులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



హైదరాబాద్, జూన్7 (ప్రజా మంటలు): ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. తెలంగాణలో క్రమంగా ధాన్యం ఉత్పత్తి పెరుగుతున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.2 కోట్ల ఎకరాల్లో ధాన్యం ఉత్పత్తి జరుగుతున్నదని పేర్కొన్నారు. ఆహార భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు. అందరికీ ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ వేదికగా జరుగుతున్న ప్రపంచ వరి సదస్సును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. రెండు రోజులపాటు జరుగుతున్న ఈ సదస్సులో భారత్ సహా 30 దేశాలు పాల్గొన్నాయి. శాస్త్రవేత్తలు, రైస్ మిల్లర్ల సంఘాల ప్రతినిధులతోపాటు 250 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్‌లో వరిసాగు, ఉత్పత్తి, నాణ్యత, విదేశీ ఎగుమతుల పెంపుపై చర్చించనున్నారు. టెక్నాలజీ, మార్కెటింగ్, ఆహార భద్రత లక్ష్యాలుగా మేధోమథనం జరుగనుంది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమన్నారు. ఇటీవలే దశాబ్ది ఉత్సవాలు జరుపుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో రైస్ సమ్మిట్ నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణ వరి ఉత్పత్తి థాయ్‌లాండ్‌తో సమానమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తమది రైతు అనుకూల ప్రభుత్వమని చెప్పారు. వ్యవసాయానికి అన్ని రకాలుగా ప్రభుత్వం మద్దతు ఇస్తున్నదని తెలిపారు. రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరకు సేకరిస్తున్నదని వెల్లడించారు. వివిధ పథకాల కింద పౌషికాహారం పోర్టిఫికేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 3 వేల అత్యాధునిక రైస్ మిల్లులు ఉన్నాయని చెప్పారు. తెలంగాణలో నీటిపారుదల వనరులు పెరుగుతున్నాయని తెలిపారు.

# ప్రజావాణి సమస్యలను పరిష్కరిస్తాం

## ప్రజాభవన్‌లో కార్యక్రమం పునఃప్రారంభంలో చిన్నారెడ్డి

హైదరాబాద్, జూన్7 (ప్రజా మంటలు):

సార్వత్రిక ఎన్నికల పక్రియ ముగియడంతో పాలనా పరమైన అడ్డంకులు తొలగాయని, ప్రజావాణిలో అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నా రెడ్డి తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నుంచి పునః ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంలో చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కారణంగా సుమారు 3 నెలల సుదీర్ఘ విరామం తరువాత ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారులకు వివరించారు. అన్ని విభాగాలకు సంబందించి మొత్తం 373 దరఖాస్తులు నమోదయ్యాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 120 దరఖాస్తులు, విధ్యా శాఖకు సంబందించి 43, మున్సిపల్ శాఖకు సంబందించి 43, హోం శాఖకు సంబందించి 29, పౌరసరఫరాల శాఖకు సంబందించి 18, ఇతర శాఖలకు సంబందించి 120 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి అధికార వర్గాలు తెలిపాయి. ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు దివ్య, ఇతర అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు.

# సంకీర్ణం నడిపే సత్తా మోడీకి లేదు

## కాంగ్రెస్ సీనియర్ నేత గౌరవ్ గొగోయ్

న్యూఢిల్లీ,జూన్7 (ప్రజా మంటలు):



ప్రధాని నరేంద్రమోదీకి సంకీర్ణ సర్కారును నడిపే లక్షణాలు లేవని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌరవ్ గొగోయ్ అన్నారు. ఆయన వచ్చే ఐదేళ్లలో పూర్తికాలం ప్రధానిగా కొనసాగడం సందేహాస్పదమే అని గొగోయ్ వ్యాఖ్యానించారు. సంకీర్ణ సర్కారును నడిపించడం అంత సులువు కాదని అభిప్రాయపడ్డారు. సంకీర్ణ సర్కారును పూర్తికాలం నడపాలంటే విశాల హృదయం ఉండాలని, ఎదుటివారి అభిప్రాయాలను ఓర్పుగా వినే మనసు ఉండాలని, అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం ఉండాలని గౌరవ్ గొగోయ్ చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీలో ఈ లక్షణాలేవి లేవని ఆయన వ్యాఖ్యానించారు.ప్రధాని నరేంద్రమోదీ సుదీర్ఘకాలం ప్రధానిగా ఎలా కొనసాగారో అర్థం కావడంలేదని గౌరవ్ గొగోయ్ అన్నారు. మోదీ కంటే రాహుల్‌గాంధీకి ఎక్కువ లోక్‌సభ స్థానాలు కట్టబెట్టిన ఉత్తరప్రదేశ్ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. వారణాసిలో మోదీకి వచ్చిన మెజారిటీ కంటే డబుల్ మెజారిటీ రాయ్‌బరేలీలో రాహుల్‌గాంధీకి వచ్చిందన్నారు. మోదీ ప్రధానిగా పనిచేసిన రెండు పర్యాయాలు బీజేపీకి స్పష్టమైన మెజారిటీ ఉన్నదని, కానీ ఈసారి మాత్రం బీజేపీకి స్పష్టమైన మెజారిటీ రాలేదని గౌరవ్ గుర్తుచేశారు. కాబట్టి ఇప్పుడు మిత్రపక్షాల అండతో ప్రభుత్వాన్ని నడపాల్సి ఉంటుందని, ప్రధాని మోదీ ఐదేళ్లు ప్రభుత్వాన్ని నడపడంపై తనకు అత్యంత అనుమానంగా ఉందని గొగోయ్ చెప్పారు.

# మోదీ నాయకత్వానికి జనసేన మద్దతు

## దేశానికి మోదీ ఒక స్ఫూర్తి అంటూ పవన్ కితాబు

## పవన్ తుఫాన్ అంటూ మోడీ ప్రశంసలు



న్యూఢిల్లీ,జూన్7 (ప్రజా మంటలు):

దేశానికి మోదీ ఒక స్ఫూర్తి అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పవన్ మాట్లాడుతూ.. మోదీ ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మోదీ స్ఫూర్తితో ఏపీలో అద్భుత విజయం సాధించామన్నారు. మోదీ వెనుక తామంతా ఉన్నామని ప్రకటించారు. ఎన్డీఏ పక్ష నేతగా మోదీకి తమ పూర్తి మద్దతును పవన్ తెలిపారు.ప్రధాని మోదీ నాయకత్వానికి జనసేన పార్టీ మద్దతిస్తుందని పవన్‌కల్యాణ్ అన్నారు. విజనరీ నాయకుల బాటలో పయనించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. 'జనసేన తరఫున మోదీకి హృదయపూర్వక శుభాకాంక్షలు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆయన స్ఫూర్తిగా నిలిచారు. మోదీ ప్రధానిగా ఉన్నంత వరకు ఏ దేశానికీ భారత్ తలొగ్గదు. మీ నేతృత్వంలో పనిచేయడాన్ని గర్వంగా భావిస్తున్నాం' అని పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసలు కురిపించారు. ఇక్కడ కూర్చున్న వ్యక్తి పవన్ కాదు తుపాను అని ప్రత్యేకంగా అభినందించారు. దక్షిణాది రాష్ట్రాల గురించి ప్రస్తావించిన సందర్భంగా ఏపీ నేతలను కొనియాడారు. పాత పార్లమెంట్ భవనంలో ఎన్డీయే ఎంపీల సమావేశం జరిగింది. కూటమి లోక్‌సభా పక్షనేతగా మోదీ పేరును భాజపా నేతలు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ ప్రతిపాదించారు. భాగస్వామ్య పార్టీలు దీనికి మద్దతు పలుకుతూ మోదీని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ప్రకటించాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఏపీలో దక్కిన విజయం ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టిందన్నారు. చంద్రబాబుతో కలిసి చరిత్రాత్మక విజయం సాధించామన్న ఆయన..ఆ సమావేశంలోనే ఉన్న పవన్‌ను అభినందించారు.

# 12న సిఎంగా చంద్రబాబు ప్రమాణం

## ఏర్పాట్లను పరిశీలించిన అచ్చన్నాయుడు

అమరావతి,జూన్7 (ప్రజా మంటలు):



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి భారీ విజయంతో ఈనెల 12న టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. మెదట జూన్ 9న ప్రమాణ స్వీకారం ఉంటుందని వార్తలు వచ్చినప్పటికీ ఆరోజున మోడీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనుండడంతో తేదీని మార్చాల్సి వచ్చింది.మంగళగిరి ఎయిమ్స్ సమీపంలో సభ నిర్వహిస్తే అందరికీ అనువుగా ఉంటుందని అధిష్ఠానం భావిస్తోంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ముఖ్య నేతలతో కలిసి ఇవాళ స్థల పరిశీలన చేయనున్నారు. కార్యక్రమానికి మోడీ కూడా హాజరుకానున్న నేపథ్యంలో హైవే పక్కనే స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు టీడీపీ నేతలు చెప్తున్నారు. మరికాసేపట్లో టీడీపీ బృందంతో కలిసి ఆ ప్రాంతాన్ని అచ్చెన్నాయుడు పరిశీలించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచీ పెద్దఎత్తున అభిమానులు, పార్టీ శ్రేణులు, ప్రముఖులు పాల్గొంటున్న నేపథ్యంలో భారీ స్థాయిలో ఏర్పాట్లను చేయనున్నారు.

# ఓడినా తిరుపతి ప్రజల సేవలో ఉంటా

## మాజీ ఎంపి, బిజెపి నేత వరప్రసాద్

తిరుపతి,జూన్7 (ప్రజా మంటలు):



ఓటమి చెందినా తన వంతుగా తిరుపతి పార్లమెంటు ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ నేత, మాజీ ఎంపీ వరప్రసాద్ అన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని వరప్రసాద్ అన్నారు. చాలా తక్కువ మెజారిటీతో ఓడిపోయానన్నారు. తాను ఎంపీగా ఉండగా.. జగన్ తన సలహాలు పాటించారని బీజేపీ నేత, మాజీ ఎంపీ వరప్రసాద్ తెలిపారు. సీఎంగా గెలుచిన తరువాత జగన్ బాగా మారిపోయారన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో ధనంజయరెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల మిథున్ రెడ్డి వల్లనే వైసీపీని వీడాల్సి వచ్చిందన్నారు. వైసీపీలో సొంత పార్టీ వారిపై కేసులు పెట్టించిన ఘనత సజ్జలదేనని పేర్కొన్నారు. సిలికా, ఇసుకా అక్రమ రవాణాను అడ్డు కోవడం వారికి తప్పుగా కన్పించిందని వరప్రసాద్ తెలిపారు. రిటైర్ ఐఏఎస్ అధికారిగా తనకు పాలనపై అవగాహన ఉందన్నారు. అక్రమాలను అడ్డుకున్న కారణంగా వైసీపీలో టిక్కెట్ దక్కుతుందని భావించలేదన్నారు. ప్రజలకు సేవ చేయాలని చంద్రబాబు, మోదీ ఆలోచనలు నచ్చి బీజేపీలో చేరి టికెట్ పొందానని వరప్రసాద్ వెల్లడించారు. సహజ వనరులు దోచుకున్న బియ్యపు మధుసూదన్ రెడ్డి, మిథున్ రెడ్డిలపై జగన్‌కు పిర్యాదు చేసినా ఎలాంటి చర్య తీసుకులేదన్నారు. వెనకబడిన వర్గాల అభిప్రాయాలను గౌరవించే స్వభావమే జగన్‌కు లేదన్నారు. జగన్ కోటరీలోని ఐదారుగురు రెడ్ల వలనే వైసీపీ ఘోరంగా ఓడిపోయిందన్నారు. గతంలో జగన్, విజయసాయి రెడ్డి, మిథున్ రెడ్డిలకి సలహాలు ఇచ్చినా పెడచెవిన పెట్టారని వరప్రసాద్ అన్నారు. జగన్ జైల్లో ఉన్నప్పుడు.. మంచి మనిషిగా బయటికి వచ్చినప్పుడు స్వార్థ పరుడిగా వ్యవహరించారన్నారు. గడచిన 5సంవత్సరాలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని.. నియంతృత్వం, అరాచక పాలన నుంచి కాపాడుకోవడానికి బీజేపీలో చేరానన్నారు. దీనిని అంతం చేయడానికి ముందుకు వచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ని అభినందిస్తున్నానని తెలిపారు. ఏ ఒక్క సామాజిక వర్గానికి కూడా మోదీ, బీజేపీ అన్యాయం చేయలేదన్నారు. తిరుపతిలో తాను గత 15 సంవత్సరాల్లో పలు అభివృద్ధి పనులు చేశానని వెల్లడించారు. ఏపీకి ప్రత్యేక హోదాను ప్రభుత్వం పరిశీలిస్తుందని వరప్రసాద్ తెలిపారు.

# డేటింగ్ యాప్‌తో యువకులకు మస్కా

## పబ్ యజామానులతో కలసి యువతుల మోసం

## ఓ యువకుడికి గంటలో 40 వేల బిల్లు వేయించి పరార్

హైదరాబాద్,జూన్7 (ప్రజా మంటలు): డేటింగ్ యాప్‌తో పరిచయం పెంచుకుని నయా మోసాలకు తెగబడుతున్నారు. ఇదంతా యువతి, పబ్ యజమానులు కలిసి ఆడుతున్న నాటకంగా గుర్తించారు. ఓ డేటింగ్ యాప్‌లో పరిచయమవుతున్న యువతులు.. హైటెక్ సిటీలోని ఓ పబ్‌కి యువకులను తీసుకెళ్లి వేలకువేలు బిల్లు చేసి ఉడాయిస్తున్నారు. ఇలా యువ బిజినెస్ మేన్‌కు తగులుకున్న రితిక అనే యువతి గంటలో రూ.40 వేల బిల్లు చేసి కనిపించకుండా జారుకుంది. ఆ పబ్ వాళ్లు ఆ డబ్బంతా కట్టాలంటూ యువకులపై ఒత్తిడి తెస్తున్నారు?! ఇప్పటివరకూ 8మంది బాధితులు వెలుగులోకి వచ్చారు..! టిండర్, బంబుల్ అనే డేటింగ్ స్కాం నగరంలో వెలుగుచూసింది. ఈ యాప్ ద్వారా పరిచయమవుతున్న యువతులు.. వెంటనే కలుద్దాం అంటూ.. వాట్సాప్ ద్వారా యువకులకు మెసేజ్ పెడుతున్నారు. ఆ యువకులను హైటెక్ సిటీలోని ఓ పబ్‌కి తీసుకెళుతున్నారు. ఆ పబ్‌లో ఖరీదైన మద్యం, ఇతర ఆహార పదార్థాలు ఆర్డర్ చేసి యువతులు కనిపించకుండా నెమ్మదిగా జారుకుంటున్నారు. గంటలో రూ.40 వేల బిల్లు చూసి యువకులు ఖంగుతింటున్నారు. ఆ డబ్బంతా కట్టాలంటూ పబ్ నిర్వాహకులు ఆ యువకులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికి 8మంది బాధితులుగా మారినట్లు తెలుస్తుంది. అయితే పబ్ నిర్వాహకులు, యువతులు కలిసి ఈ స్కాంకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. తాము కూడా బాధితులమేనంటూ పలువురు ముందుకు వస్తున్నారు. దీనిపై ఇప్పటి వరకూ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

## సంపాదకీయం

# ప్రజల ఆశను శ్వాసగా చేసుకుని నడవాలి !

ప్రజల ఆశను శ్వాసగా చేసుకుని ఎన్‌డిఎ పక్షాలు ఇక దేశం కోసం పనిచేయాల్సి ఉంది. పదేళ్ల కాలం మోడీ పాలన ఒక ఎత్తు..ఈ ఐదేళ్ల కాలం మరో ఎత్తు అన్న విషయం గుర్తించి ముందుకు సాగాల్సి ఉంది. ఇప్పుడే ఎన్‌డిఎ పక్షాలకు అధికారం వచ్చింది. ఉమ్మడిగా పాలించే అవకాశం చిక్కింది. ఈ క్రమంలో వీరంతా దేశం కోసం కఠిన పరిశ్రమ చేయాలి. దేశం ఎన్నో సమస్యలను, సవాళ్లను ఎదుర్కొంటోంది. అవేమీ పరిష్కరించ లేని సమస్యలు కాదు..అవన్నీ కూడా పరిష్కార యోగ్యంగా ఉన్నవే. కాకపోతే చిత్తశుద్ధి పెట్టి పనిచేయాల్సి ఉంది. ప్రధానంగా ఎన్‌డిఎ పక్షాలు ముందుగా దేశం ముందున్న సమస్యలపై చర్చ చేయాలి. తమతమ రాష్ట్రాల్లో క్షేత్రస్తాయిలో పర్యటించి ప్రజల ఆకాంక్షలను తెలుసుకోవాలి. వాటిని ఎన్‌డిఎ వేదికపై పెట్టి చర్చించాలి. ముందుగా ప్రజలు తమంతగా తాము ధైర్యంగా బతకగలిగే పరిస్థితులను తీసుకుని రావాలి. ఇందుకు సంకల్పం కూడా కావాలి. ఎన్నికల్లో గెలిచాం..మరో ఐదేళ్ల తరవాత గెలవడంఎలా అన్న తరహాలో పథకాలతో పోటీపడుతూ పోతే ప్రజలు మరో పార్టీని ఆదరిస్తారని గుర్తించాలి. ఇక ప్రధానంగా ఉచిత పథకాలకు, తాయిలాలకు స్వస్తి పలకాలి. ప్రజలను బిచ్చగాళ్లుగా చేసే పథకాల రచనను మానాలి. ప్రజలు స్వయం శక్తితో బతికేలా చేయాలి. వండివార్చి పెడతామన్న రీతిలో డబ్బుల పందేరం చేసే పద్దతులను మానుకోవాలి. ప్రధానంగా విద్య,వైద్యరంగాలను బలోపేతం చేయాలి. ప్రతి ఒక్కరు సర్కార్ స్కూళ్ల వైపు చూసేలా చేయాలి. కార్పోరేట్ దోపిడీని అడ్డుకోవాలి. వైద్యరంగంలో కూడా విప్లవాత్మక మార్పులు రావాలి. ప్రభుత్వ ఆస్పత్రులు కార్పోరేట్ ఆస్పత్రులను తలదన్నేలా పటిష్టం చేయాలి. ఇందుకు ఎంతైనా ఖర్చు చేయాలి. అలాగే ధరలను అదుపు చేసేందుకు కసరత్తు చేయాలి. నిరుద్యోగ సమస్యను ప్రధాన అంశంగా తీసుకుని ముందుకు సాగాలి. అదేపనిగా ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్రలను అడ్డుకోవాలి. విశాక స్టీల్ కావచ్చు..ఎల్‌ఐసి లాంటి సంస్థలను బలోపేతం చేస్తే కొంతయినా నిరుద్యోగ సమస్య తీరుతుందని గుర్తించాలి. కొత్తగా సంస్థలను తీసుకుని రావాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. అవంతేగాకుండా సమస్యలు ఏవైనా పార్లమెంటులో చర్చ జరిగేలా చూడాలి. గత పదేళ్లలో ఏ అంశంలోనూ సమగ్ర చర్చ జరగలేదు. విపక్షాలను పురుగులకన్నా హీనంగా చూశారు. మాట్లాడితే సభనుంచి బయటకు పంపారు.

ఈ తరహా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నుంచి బయటపడాలి. బీజేపీలో ఆత్మవిమర్శ వస్తుందని..ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారని..ప్రజలకు మేలు జరుగుతుందని అంతా భావించేలా చేయాలి. బిజెపి అంటే ఇక్కడ మోడీ అని మాత్రమే గుర్తించాలి. మంచి చేసి ప్రజల మనసులు గెల్చుకోవడం ద్వారా ఎన్నికల్లో గెలవాలన్న భావన లేదా ఆలోచన స్థిరపడాలి. ధరలు తగ్గించడం, ముఖ్యంగా గ్యాస్, పెట్రో ధరలు తగ్గించడం, నిత్యావసరాల ధరలు తగ్గించడం, జిఎస్టీ భారాలపై కోతలు పెట్టడం, బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గించడం, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన చేయడం వంటి విషయాల్లో ఆలోచన చేయడం వంటివి బిజెపి నేతల ఎజెండాలో ప్రధానం కావాలి. ఎన్‌డిఎ నేతల ఎజెండాలో ఇవి చేరాలి. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు కాకుండా ఎలాంటి చర్చలు చేసినా, మేథోమధనం చేసినా ప్రజలు పట్టించుకోరని తాజా ఫలితాలు రుజువు చేశాయి. అందుకే బిజెపికి వాతలు పెట్టారు. 400 సీట్ల లక్ష్యం నెరవేరకుండా చేశారు. కేవలం బిజెపిని 240 సీట్లకే పరిమితం చేయడం ద్వారా ఎన్‌డిఎ నేతలకు పగ్గాలు అప్పగించారు. ఇప్పటి కయినా బిజెపి అగ్రనాయకులుగా ఉన్న మోడీ, అమిత్ షా లు ఈ పరిణామాలను గుర్తించాలి. అన్ని పార్టీలకన్నా తాము భిన్నమని చెప్పుకుంటున్న బిజెపి ప్రజల కోణంలో పాలన చేయడం మొదలు పెట్టాలి. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ చేయాలి. ప్రజలకు నమ్మకం కలిగించాలి. వీటిపైనే మేథోమధనం చేయాలి. ఇలాంటి సమయంలో బీజేపీ అగ్ర నాయకత్వం స్పీడ్ పెంచాలి. బీజేపీ ఆశించిన స్థాయిలో పరిస్థితులు కనిపించడం లేదన్నది నూటికినూరు శాతం నిజం. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. ప్రస్తుత గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో బీజేపీ దిద్దుబాటు చర్యలకు దిగుతుందని అంతా ఆశిస్తున్నారు. ఈ క్రమంలో బిజెపి తన ఎజెండాను మార్చుకోవాలి. ముందుగా ప్రజల ఆశాలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవాలి. అందుకు తగిన ప్రణాళికతో ముందుకు సాగాలి. అప్పుడే నమ్ముతారని గుర్తించాలి. ఇకపోతే దేశంలో రాజకీయాల తీరు మారాలి. ఇంతకాలం దూకుడు ప్రదర్శించిన బిజెపి ఇప్పుడు దేశం కోసం దూకుడు ప్రదర్శించాలి. ఎవరూ కలలో కూడా ఊహించని రీతిలో కాంగ్రెస్ అత్యధిక స్థానాల్లో గెలవడమే కాదు.. సీట్లు కూడా దక్కించుకుంది.కాంగ్రెస్ ముక్త భారత్ అంటూ ఊదరగొట్టిన ప్రధాని మోడీ , ఇప్పుడు సమాధానం వెతుక్కోవల్సి వస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలు శక్తివంతులు. ఎవరు ఎప్పుడు ఎలా ఆలోచిస్తారో చెప్పలేం. అందువల్ల ప్రజలు దృష్టిలో పెట్టుకుని రాజకీయాలు చేయాలి. పార్టీలను దృష్టిలో పెటుటకుని కాదు అని గుర్తించాలి. దేశం కోసం ఏమైనా చేయగలరన్న నమ్మకం ప్రజల్లో కలిగితే గుండెల్లో పెట్టు కుంటారు. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు, అయోధ్యలో రామాలయ నిర్మాణం, ట్రిబుల్ తలాక్ రద్దు చేయాల్సిందే. ఉమ్మడి పౌరస్మృతి రావాల్సిందే. వీటితో పాటు ప్రజలు బతకడం ఎలా అన్న ఆలోచన చేయకపోతే ప్రజలు ఈ చారిత్రాత్మక విజయాలు కూడా చిన్నవిగా కనిపిస్తామి. ఆకలి, నిరుద్యోగం ముందు ఈ విజయాలు పెద్విగా కనిపించవని బిజెపి నేతలు గుర్తించాలి. అందుకే మునుపటితో పోలిస్తే కాంగ్రెస్ చాలా బలపడిందన్నది మాత్రం గుర్తుంచుకోవాల్సిందే. ఇదంతా ప్రజల్ల వచ్చిన మార్పుగా గుర్తించి బిజెపి నేతలు ముందుకు సాగితేనే దేశ ప్రజలు స్వాగతిస్తారు. విపక్షాలను తిట్టిపోస్తూ..అసలు సమస్యలను పక్కదారి పట్టించే రాజకీయాలను మానుకోవాలి.

## సిరిసిల్ల సహకార బ్యాంక్ బిఆర్ఎస్ కైవసం

రాజన్నసిరిసిల్ల,జూన్7(ప్రజామంటలు):
సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ చైర్మన్ పదవి బీఆర్ఎస్ కైవసమైంది. చైర్మన్‌గా రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్‌గా అడ్డగట్ల మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సింగిల్ నామినేషన్ దాఖలుతో చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ఏకగ్రీవ మైంది. కాగా, కొత్తగా ఎన్నికైన పాలకవర్గానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల్లో బీఆర్ఎస్ జయకేతనం ఎగురవేసింది. 12 డైరెక్టర్ స్థానాలకు గురువారం జరిగిన ఎన్నికల్లో 8 స్థానాల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందగా, ఇద్దరు ఇండిపెండెంట్లు, బీజేపీ, కాంగ్రెస్ తరఫున ఒక్కో అభ్యర్థి గెలుపొందారు. గెలిచిన ఇద్దరు ఇండిపెండెంట్లలో ఒకరు గుడ్ల సత్యానందం బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. దీంతో బీఆర్ఎస్ మద్దతుదారుల సంఖ్య 9కి చేరింది. ఈ క్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం బీఆర్ఎస్ ప్యానల్ మాత్రమే నామినేషన్ దాఖలు చేసింది. సింగిల్ నామినేషన్ దాఖలు కావడంతో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవమైంది. అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యూహం ఫలించింది. ఎన్నికల ముందు రెండు రోజులుగా ఓటర్లకు స్వయంగా ఫోన్ చేసి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేటీఆర్ చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఓటర్లు బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారు. దీంతో వారికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

## సిఎస్‌గా బాధ్యతలు చేపట్టిన నీరభ్ కుమార్

## పూనం మాలకొండయ్య తదితరుల బదిలీ

అమరావతి,(ప్రజామంటలు):
ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి నీరభ్ కుమార్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 1987 బ్యాచ్‌కు చెందిన ఆయన.. ప్రస్తుతం రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు సీఎస్‌గా ఉన్న కె.ఎస్.జవహర్‌రెడ్డి గురువారం సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో నూతన సీఎస్ నియామకం జరిగింది. కొత్త సీఎస్ నియమాకం జరిగినందున జవహర్‌రెడ్డిని బదిలీ చేశారు. ఆ వెంటనే ఆయన బాధ్యతలు కూడా స్వీకరించారు. బుధవారం ఉదయం తెదేపా అధినేత చంద్రబాబును నీరభ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి వెళ్లారు. ఈ క్రమంలోనే సీఎంవోలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. పూనం మాలకొండయ్య, రేవు ముత్యాలరాజు, నారాయణ భరత్ గుప్తా ఈ ముగ్గురు ఐఏఎస్ అధికారులు జీఏడీకి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరో వైపు నూతన సీఎస్‌గా నియమితులైన నీరభ్ కుమార్ ప్రసాద్ సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో బాధ్యతలు చేపట్టారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఏక్తాకపూర్

తిరుమల,జూన్7(ప్రజామంటలు):
కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని బాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఏక్తా కపూర్ దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో తితిదే అధికారులు శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల ఏక్తాకపూర్ సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు.



## కవిత్వం

### సాగర ఘోష

సముద్రాన్ని చూస్తే ...
అద్భుతం ! ఆనందం !
అపురూపం !అనంతం !
మానవాళి విచ్చలవిడిగా
ప్లాస్టిక్ వ్యర్థాలను వాడి
కడలి
గర్భంలో టన్నుల కొద్దీ
చెత్తను
పేర్చుతున్నారు !

తనని ఇష్టపడ్డవారిని
అమ్మలా లాలిస్తుంది.
తనని కష్టపెట్టినవారిని
అమ్మోరులా కబలిస్తుంది!

ప్రపంచ జీవకోటికి
సముద్రమే
అమ్మ !
చేయి చేయి కలిపి రక్షిస్తే
జగతికి పట్టు కొమ్మ !!
కడలి తల్లి కన్నీరు కారిస్తే
విశ్వం వినాశనమై ఈ
భువిపై
మిగిలేది బూడిద బొమ్మ !!!

( జూన్ 8 సాగర నోత్సవం
సందర్భంగా ... )

బి. పాండురంగ
8341212132

# అగ్రనేతల ఆశీస్సులు తీసుకున్న మోదీ

న్యూఢిల్లీ, (ప్రజామంటలు):
ఎన్డీయే లోక్‌సభాపక్ష నేతగా ఎన్నికైన నరేంద్ర మోదీ భాజపా కురువృద్ధుడు ఎల్.కె.అద్వాణీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం ముగిసిన తర్వాత నేరుగా ఆయన ఇంటికివెళ్లిన మోదీ... వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోతున్న విషయాన్ని ఆయనకు స్వయంగా చెప్పారు. ఇద్దరు నేతలూ వివిధ అంశాలపై కొద్దిసేపు చర్చించుకున్నారు. అక్కడి నుంచి పార్టీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి ఇంటికి వెళ్లిన మోదీ.. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.ఎన్డీయే కూటమి నేతలతో కలిసి మోదీ మరికాసేపట్లో రాష్ట్రపతి భవన్‌కు చేరుకోనున్నారు. తమ వద్ద ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలం ఉందని చెబుతూ.. అవకాశం ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజ్ఞప్తి చేయనున్నారు. శుక్రవారం దిల్లీలో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నరేంద్ర మోదీని లోక్‌సభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. తాజా సార్వత్రిక ఎన్నికల్లో భాజపా 240 స్థానాల్లో విజయం సాధించింది. అయితే, మిత్రపక్షాలతో కలిసి 293 స్థానాలను సొంతం చేసుకొని ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది.











# ప్రజావాణి పునఃప్రారంభం

## ఆర్జీలు ఇచ్చిపందుకు వచ్చన జనం



హైదరాబాద్, జూన్ 07 (ప్రజామంటలు):
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం శుక్రవారం పునః ప్రారంభమైంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ వల్ల తాత్కాలికంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే గురువారంతో ఎలక్షన్ కోడ్ ముగియడంతో నేటి నుంచి ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జీ చిన్నారెడ్డి తెలిపారు.గతంలో వలే మంగళ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలను అర్జీల ద్వారా ప్రభుత్వ దృష్టి తీసుకురవాచ్చన్నారు. ప్రజావాణిలో వచ్చిన వినతులకు అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వర పరిష్కారాలు చూపాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కాగా, ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ప్రతిరోజూ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తాను కూడా ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తానని తెలిపారు. అయితే మొదటి రోజు మినహా ఆయన ఎప్పుడూ ఈ కార్యక్రమంలో పాల్గొనకపోవడం గమనార్హం. అదేవిధంగా రోజూ నిర్వహిస్తామన్న కార్యక్రమాన్ని వారంలో రెండు రోజులకు కుదించారు.

# వైకాపాకు తొలి దెబ్బశ్రీ పార్టీని వీడిన రావెల కిశోర్ బాబు

అమరావతి, జూన్ 07 (ప్రజామంటలు):
ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోల్పోయిన వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మాజీ మంత్రి రావెల కిశోర్ బాబుపార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈమేరకు పార్టీ అధినేత జగన్‌కు రాజీనామా లేఖ పంపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు రాజ్యాధికారం వైసీపీతోనే సాధ్యమని పార్టీలో చేరానని, అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీని ప్రజలు తిరస్కరించారని అందులో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేసేందుకు వైసీపీని వీడుతున్నట్లు వెల్లడించారు. సంక్షేమం, సమగ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని కూటమికి చారిత్రక విజయం సాధించిపెట్టారని చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా సమర్ధవంతంగా పనిచేసి పేద ప్రజలకు సేవచేశానని తెలిపారు. దురదృష్టవశాత్తూ కొన్ని కారణాల వల్ల టీడీపీలో కొనసాగలేకపోయానని చెప్పారు. త్వరలోనే ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం లభిస్తుందని విశ్వసిస్తున్నాని తెలిపారు.రావెల కిశోర్ బాబు బ్యూరోక్రాట్, పదవి వదిలి 2014 అసెంబ్లీ ఎన్నికల కన్నా ముందు తెలుగుదేశం పార్టీలో చేరారు. చంద్రబాబు హయాంలో ఏర్పడిన ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 2019లో టీడీపీ ఓడిపోవడంతో వైసీపీలో చేరారు. తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఏపీ వ్యవహారాలను కొద్దిరోజులు చూశారు. అంతలో మళ్లీ వైసీపీకి వచ్చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ దారుణంగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. దాంతో పార్టీకి రావెల కిశోర్ బాబు రాజీనామా చేశారు.

## వాసుదేవరెడ్డి ఇంట్లో సిఐడి సోదాలు

అమరావతి, జూన్ 07 (ప్రజామంటలు):
ఏపీ బెవరేజెస్ ఎండీగా పనిచేసిన వాసుదేవరెడ్డి నివాసంలో సీఐడీ సోదాలు నిర్వహించింది. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని వాసుదేవరెడ్డి నివాసంలో ఉదయం నుంచి సోదాలు జరుగుతున్నాయి. జగన్ హయాంలో మద్యం దోపిడీ పర్వాన్ని ముందుండి నడిపించారని ఆరోపణలు వెల్లువెత్తడంతో సీఐడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. వైసీపీకి కరడుగట్టిన మద్దతుదారుగా వాసుదేవరెడ్డి పని చేశారు. వైసీపీకి అనుచిత లబ్ది కలిగించేలా భారీ ఎత్తున మద్యం సరఫరా చేశారని ఫిర్యాదులు అందాయి. నూతన మద్యం విధానం పేరుతో వైసీపీ నేతలకు లబ్ది కలిగేలా పనిచేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీలో జే-బ్రాండ్ మద్యం తీసుకురావడంలో వాసుదేవరెడ్డిది కీలకపాత్ర. డిస్టిలరీలన్నీ అనధికారికంగా వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లడంలో వాసుదేవరెడ్డిది కీలకపాత్ర. జే-బ్రాండ్ మద్యం ప్రభుత్వ దుకాణాల్లో అమ్మించిన ఘనత వాసుదేవరెడ్డిదేనని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# హోమియో ఆస్పత్రిలో పెచ్చులూడిన సీలింగ్

## ఇద్దరు పిజి విద్యార్థులకు తీవ్ర గాయాలు

హైదరాబాద్,జూన్ 07 (ప్రజామంటలు):
రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిలో సిలింగ్ పెచ్చులూడిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు పీజీ విద్యార్థినులు గాయపడ్డారు. ఆసుపత్రి సిబ్బంది వెంటనే స్పందించి.. వారిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఒక విద్యార్థినికి తీవ్ర గాయాలు కాగా.. మరో విద్యార్థినికి స్వల్పగాయాలయ్యాయి. దీంతో తీవ్రగాయాలైన విద్యార్థినికి ఐసీయూలో వైద్యులు? చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇన్‌పేషంట్ వార్డులో ఈ ఘటన చోటు చేసుకుంది.

# జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్

హన్మకొండ జూన్ 07 (ప్రజామంటలు):
దేశ వ్యాప్తంగా నిర్వహించబోవుచున్న జాతీయ లోక్ అదాలత్ ను శనివారం రోజు ఉ: 10.00 గం.ల కు వరంగల్, హన్మకొండ జిల్లా కోర్టు ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు మరియు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, వరంగల్- చైర్మన్స్ బి.వి.నిర్మలా గీతాంబ మరియు సి.హెచ్.రమేష్ బాబు ప్రారంభించుచున్నట్లు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉభయ జిల్లాల న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్, హనుమకొండ కార్యదర్శులు యం.సాయి కుమార్, జె.ఉపేందర్ రావు, వరంగల్, హనుమకొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, న్యాయవాదులు తదితరులు పాల్గొననున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తెలిపింది.

## డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్

### కోర్సుల్లో 2024-2026 విద్యా సం. ప్రవేశాలకు దరఖాస్తులు

హన్మకొండ జూన్ 07( ప్రజామంటలు):
ఎస్.సి.ఈ.ఆర్.టి ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ మరియు డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో 2024-2026 విద్యా సం. ప్రవేశాలకు ధరఖాస్తులను జూన్ 08, నుండి 30వ తేది లోగా ఆన్లైన్ లో సమర్పించాలని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (హనుమకొండ), ప్రధానాచార్యులు నారాయణ రెడ్డి తెలిపారు. ఆన్లైన్ లో జూలై 10 నాడు డీఈఈసెట్-2024 ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం http://deecet.cdse.telangana.gov.in వెబ్సైట్ చూడాలని కోరారు.

## రెగ్జిన్ షాపులో అగ్నిప్రమాదం

మహబూబ్‌నగర్,జూన్ 07 (ప్రజామంటలు):
మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తా వద్ద భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. చౌరస్తా సమీపంలోని అమ్మవారి దేవాలయం పక్కన ఉన్నటువంటి సాయిరెగ్జిన్ షాపులో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దట్టంగా పొగ కమ్ముకోవడంతో జనం భయంతో పరుగులు తీశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో మంటలు ఎగిసిపడి పక్క షాపులకు కూడా వ్యాపించాయి. దీంతో స్థానికులు ͺ÷ర్ సిబ్బందికి సమాచారం అందించారు.

# మున్నూరు కాపుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయండి

## జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి తరలి రండి: చుక్క గంగారెడ్డి పిలుపు



బుగ్గారం జూన్ 07 (ప్రజామంటలు):
ఈనెల 9 ఆదివారం ఉదయం 10-00 గంటలకు జగిత్యాల లోని ధర్మపురి రోడ్డులో గల బూసి లక్ష్మి నారాయణ ఫంక్షన్ హాల్ లో జరుగనున్న జిల్లా స్థాయి మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం సభను విజయ వంతం చేయాలని ప్రముఖ ఉద్యమకారుడు, ఆల్ ఇండియా మీడియా అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన బుగ్గారం లో మీడియాతో మాట్లాడారు. మున్నూరు కాపుల ఐక్యత కోసం, కుల అభ్యున్నతి కోసం జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల విద్యావంతులు, మేధావులు, రైతులు, యువత, మహిళలు, కార్మికులు, జర్నలిస్టులు, న్యాయవాదులు మూకుమ్మడిగా ఒక్కటై జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. అట్టి జిల్లా నూతన కార్యవర్గం ఈ ఆదివారం ఉదయం 10-00 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనుందని ఆయన తెలిపారు. అత్యంత వైభవంగా జరిగే ఈ ప్రమాణ స్వీకార కార్ర్యమానికి మున్నూరు కాపు రాష్ట్ర ముఖ్యులు, వివిధ జిల్లాల లోని కుల ప్రముఖులు హాజరు కానున్నారని ఆయన వివరించారు. జగిత్యాల జిల్లా లోని వివిధ పట్టణాల నుండి, మండలాల నుండి ప్రతి గ్రామం నుండి మున్నూరు కాపులు ఇట్టి ఆత్మీయ సమ్మేళనం - నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార ఉత్సవానికి తరలి వచ్చి విజయ వంతం చేయాలని చుక్క గంగారెడ్డి పిలుపునిచ్చారు.






## పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలకు సౌకర్యాలు కల్పించాలి

### మున్సిపల్ ఛైర్పర్సన్ కు వినతి

జగిత్యాల జూన్ 07 (ప్రజామంటలు):
జిల్లా కేంద్రంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే పెద్దమ్మ తల్లి బోనాల పండుగ ఈనెల 13 గురువారం జరిగే కార్యక్రమంకు భక్తులకు అసౌకర్యం కలుగకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు, చలువ పందిర్లు, దారి పొడవునా మొరం పోసి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని ముది రాజ్ సంఘం సభ్యులు మున్సిపల్ ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ స్థానిక నివాసం లో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో నీలం పెద్దులు, జిల్లా అధ్యక్షులు జంగిలి రాజేష్ పట్టణ అధ్యక్షులు కట్ట గంగాధర్, కొక్కు రాజేందర్, నారవేని హరికృష్ణ, ఈరవెని ప్రణయ్, జైనపురం రమేష్, ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# గుంతలమయమైన మాతా శిశు ఆసుపత్రి రోడ్డు

## మొరం పోయించి బాగు చేయించిన ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



జగిత్యాల జూన్ 07 (ప్రజామంటలు):
జగిత్యాల ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రి రోడ్డు గుంతలతో నరకంగా మారి ఆసుపత్రి వచ్చే గర్భిణీలు, మహిళలు, రోగులు ఈ రోడ్డు వెంట వెళ్ళాలంటేనే ఇబ్బందులు పడుతుండటంతో జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ స్పందించారు. మాతా శిశు ఆసుపత్రి కి వెళ్ళే దారిలో ఆర్టీసి బస్సులు, రహదారి ఇరువైపుల చెట్లకొమ్మల ను మున్సిపల్ ఆధ్వర్యంలో తొలగించారు. విద్యుత్ దీపాలు ఆసుపత్రి వెళ్ళే దారిలో రోడ్డు మార్గం గుంతలు లేకుండా మొరం పోసి ఆసుపత్రి కి వెళ్ళే అంబులెన్స్, వాహన దారుల వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఛైర్పర్సన్ తెలిపారు.

# కాళ్లకు నమస్కరించబోయిన నితీశ్

## సున్నితంగా తిరస్కరించిన మోడీ

## పార్లమెంట్ హాలులో ఆసక్తికర సన్నివేశం

న్యూఢిల్లీ, జూన్ 07 (ప్రజామంటలు):
లోక్‌సభ ఎన్నికలు-2024లో ఎన్డీఏ (ఔఆం) మ్యాజిక్ ఫిగర్‌ను మించి 293 స్థానాలను కైవసం చేసుకోవడంతో.. మూడోసారి ప్రభుత్వ ఏర్పాటు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే.. ఆ కూటమి ఎంపీలు శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా.. ఓ ఆసక్తికరమైన సన్నివేశం చోటు చేసుకుంది. ఎన్డీఏ కూటమి నాయకుడిగా నరేంద్ర మోదీకి మద్దతు తెలియజేసేందుకు నితీశ్ కుమార్ లేచి వెళ్లి మాట్లాడారు. అనంతరం తన సీట్లోకి వెళ్తున్నప్పుడు.. మోదీతో చేతులు కలిపి, ఆయన పాదాలను తాకేందుకు ప్రయత్నించారు. అయితే.. తన పాదాల్ని తాకొద్దని మోదీ సున్నితంగా తిరస్కరిస్తూ నితీశ్‌తో కరచాలనం చేశారు. ఆ సమయంలో ఇద్దరూ చిరునవ్వు చిందిస్తూ కనిపించారు. అంతకుముందు నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. ఏ సందర్భంలోనైనా తాను ప్రధాని మోదీతోనే ఉంటానని నొక్కి చెప్పారు. ఇండియా కూటమి నేతలు ఈసారి పొరపాటున గెలిచారని.. దేశం కోసం వాళ్లు ఏమీ చేయలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వాళ్లందరూ కచ్చితంగా ఓడిపోతారని జోస్యం చెప్పారు. దేశం ఇకపై బృహత్తర ప్రణాళికలు వేసుకుని ముందుకు సాగుతుందని.. మోదీ నేతృత్వంలో తామంతా కలిసి పని చేస్తామని చెప్పారు. ఈ పదేళ్ల కాలంలో దేశం కోసం మోదీ ఎంతో చేశారన్నారు. ఎన్డీఏ పక్షాలన్నీ ఏకతాటిపైకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆదివారం మోదీ ప్రధానిగా ప్రమాణం చేయబోతున్నారని, కానీ ఇవాళే ఆయన ప్రమాణస్వీకారం చేయాలని తాను కోరుకుంటున్నానని నితీశ్ చెప్పుకొచ్చారు. ఇదిలావుండగా.. ఢిల్లీలోని పాత పార్లమెంట్ భవనంలో ఎన్డీఏ కూటమి ఎంపీలతో పాటు ఎన్డీఏ పార్టీల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు సమావేశం అయ్యారు. ఈ భేటీలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మోదీ నాయకత్వానికి లాంఛనంగా ఆమోదముద్ర వేశారు. ఈ భేటీ అనంతరం చంద్రబాబు, నీతీశ్‌కుమార్ సహా పలువురు అగ్రనేతలతో కలిసి.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూతో మోదీ సమావేశం అవుతారు. ఎన్డీయేకు మద్దతిస్తున్న ఎంపీల జాబితాను, మద్దతు లేఖలను సమర్పిస్తూ.. తన నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమివ్వాలని కోరుతారు.



# మంత్రి పదవుల పేరుతో బురిడీ కొట్టిస్తారు

## ఎన్‌డిఎ సమావేశంలో మోడీ హెచ్చరిక

న్యూఢిల్లీ, జూన్ 07 (ప్రజామంటలు):
తమ కూటమి నాయకుడిగా నరేంద్ర మోదీని ఎన్డీయే నేతలంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనిపై మోదీ మాట్లాడుతూ.. తన మిత్రపక్షాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే క్యాబినెట్ బెర్త్‌ల విషయంలో బురిడీ కొట్టించేవారుంటారని జాగ్రత్త అని చెప్పారు. ఈసందర్భంగా ఆయన చెప్పిన మాటలతో కూటమి ఎంపీలంతా చిరునవ్వులు చిందించారు. కొంతమంది మీ దగ్గరకు వచ్చి, క్యాబినెట్ బెర్త్ ఇప్పిస్తామని చెప్తారు. టెక్నాలజీ ఏ స్థాయిలో ఉందంటే.. నా సంతకాలతో ఉన్న జాబితా బయటకు రావొచ్చు. ఇలాంటి చర్యలతో ఎలాంటి ప్రయోజనం ఉండదు. అలాంటి కుట్రలకు చిక్కొద్దని ఎంపీలను కోరుతున్నాను. ఈ విషయంలో విపక్ష కూటమికి డబుల్ పీహెచ్‌డీ ఉంది. వారు తమ నైపుణ్యాలను ఉపయోగించే అవకాశం ఉంటుంది. వదంతులకు దూరంగా ఉండండి. సంచలనాల కోసం చేసే ఇలాంటి ప్రయత్నాలతో దేశాన్ని నడపించలేం‘ అని నవ్వుతూనే హెచ్చరిక చేశారు. నకిలీ సమాచార వ్యాప్తిని ఉద్దేశించే ఆయన ఈవిధంగా స్పందించారు. ఇక ఈ ప్రసంగంలో పలు అంశాలను ప్రస్తావించారు. ఔఆం అంటే ’న్యూ ఇండియా, డెవలప్‌డ్ ఇండియా, ఆస్పిరేషనల్ ఇండియా’ అని కొత్త అర్థం చెప్పారు. విపక్ష నేతలపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ఇప్పటికీ తన శక్తి సామర్థ్యాలను తెలుసుకునే ప్రయత్నం చేయట్లేదని ఎద్దేవా చేశారు. మరో పదేళ్లయినా ఆ పార్టీ 100 స్థానాల మార్క్‌ను దాటలేదు అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు.



శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో జరిగిన అనఘా దేవి వ్రతం సందర్భంగా మాకు సహకరించిన పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు గౌరీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తాటిపాముల వినోద్ మరియు కార్యవర్గ సభ్యులు అందరికీ, పాల్గొన్న మాతలకు భక్తులకు కృతజ్ఞతలు తెలిపిన కట్కం అమర్ నాథ్.

# ఎంపీ కడియం కావ్యకు శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ నాయకులు

వేలేరు జూన్ 07 (ప్రజామంటలు):
వేలేరు మండలం పీచర గ్రామం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ శుక్రవారం వరంగల్ లోక్ సభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన ఎంపీ కడియం కావ్యం మరియు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కీర్తి వెంకటేశ్వర్లు, మాజీ వైస్ చైర్మన్ గుజ్జుల రామ్ గోపాల్ రెడ్డి, మల్కిరెడ్డి రాజేశ్వర్రెడ్డి, గట్టయ్య, ఎంపిటిసి జల్దార్ సంపత్, మాజీ ఉపసర్పంచ్ శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# నాణ్యమైన పట్టు వస్త్రాలకు కేర్ ఆఫ్ అడ్రస్ తెలంగాణ:సుధా జైన్

**హైదరాబాద్, జూన్ 07 (ప్రజామంటలు):**
తెలంగాణ రాష్ట్రం నాణ్యమైన పట్టు వస్త్రాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని సోషలైట్ డాక్టర్ సుధాజైన్ అన్నారు. గురువారం హైదరాబాద్లోని జూబ్లీహిల్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాజైన్ మాట్లాడుతూ%ి%. చేనేత కళా కారుల ఉత్పత్తులను దేశ, విదేశాలకు పంపి చేనేత కళాకారుల ప్రతిభను చాటిచెప్పడం తమ లక్ష్యమని, చేనేత వస్త్రాలను కోనేలాగా వారు చేనేత ఉత్పత్తులను ధరించేలా చేయడమే తమ కోహినూర్ స్టోరీ ఉద్దేశమని అన్నారు. చేనేత ఉత్పత్తులను తయారు చేసే వారిని ప్రోత్సహిస్తూ తమవంతుగా చేయూతనివ్వడమే తమ ధ్యేయమని, చేనేత కళాకారుల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేందుకు తాము దోహద పడతామని శ్రీ పాండురంగ హ్యాండ్లూమ్స్ చిట్టిమల్ల పాండు చెప్పారు. విభిన్నమైన, అరుదైన చేనేత ఉత్పత్తులను వినియోగదారులకు అందించడంతోపాటు వాటి పట్ల ఆదరణ పెంచడమే తమ ఉద్దేశ్యం అని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్నచేనేతనేత కార్మికులను గౌరవించడం, ప్రోత్సహించడంమే ఈ కోహినూర్ ఉద్దేశ్యం అని తెలిపారు. మార్కెట్ లో లభించే నకిలీ పట్టు వస్త్రాలను ఎలా తెలుసుకోవాలో,నాణ్యమైన చేనేత వస్త్రాలను ఎలా గుర్తించాలో కూడా ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. కొంత మంది సింథటిక్ ను సిల్క్ గా అమ్ముతున్నారు. దీనిపై అవగాహన కల్పించడానికి తమ సంస్థ కృషి చేస్తోందని అన్నారు. చేనేత కళాకారుల డిజైన్లకు ఒక రూపు తెచ్చి వారు రూపొందించిన డిజైన్లను ఇతరులు కాపీ చేయకుండా ఒక అల్బమ్ ను ఈ సందర్భంగా విడుదల చేశామని సుధజైన్ వెల్లడించారు. చేనేతకు చేయూతనివ్వాలని నంది అవార్డు గ్రహీత, టెలివిజన్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షులు, హైదరాబాద్ సమయ్ హిందీ డైలీ న్యూస్ పేపర్ ఎడిటర్ మహమ్మద్ షరీఫ్ రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. వారంలో ఒక రోజు తప్పనిసరిగా చేనేత వస్త్రాలు ధరించి, చేనేతకు చేయూతనివ్వాలని ప్రజల అవసరాలకు అనుగుణంగా చేనేత డిజైన్లను రూపొందిచాలని, నైపుణ్యం కలిగిన చేనేతకారులను ప్రోత్సహించాలని షరీఫ్ చెప్పారు. నాణ్యమైన చేనేత వస్త్రాలను డైరెక్ట్ టూ కస్టమర్ అనే ఆలోచనతో తక్కువ ధరలకే అందిస్తూ చేనేత కళాకారులను ప్రోత్సాహి స్తున్నట్లు తాను చేయ బోయే తదుపరి చిత్రం గిరి పుత్రిక లోను చేనేత వస్త్రాలను కళాకారుల (కాస్ట్యూమ్స్) కోసం వినియోగిస్తామని నిర్మాత దర్శకుడు రమేష్ రాజ చెప్పారు.





## బడిబాట పై ప్రధానోపాధ్యాయులతో సమీక్షించిన ఎంపీపీ జాజాల భీమేశ్వరి

**ఇబ్రహీంపట్నం జూన్ 07 (ప్రజామంటలు):**
ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బడిబాట పైన సమీక్ష నిర్వహించిన ఎంపీపీ జాజాల భీమేశ్వరి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే ఫలితాలు తప్పకుండా వస్తాయని ఈ సందర్భంగా తెలియజేశారు. మండలంలోని 19 పాఠశాలకు అమ్మబడి పాఠశాల కింద నిధులు మంజూరయ్యాయని వాటిని త్వరగా పూర్తిచేయాలని అన్నారు, మన ఊరు మనబడి కింద మంజూరైన పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని కోరనైనది. గత ఏడాది పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పాఠశాలలో ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, ఎంఈఓ ఆనందరావు, ఎంపీఓ కృపాకర్, ఆయా గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.




## జమ్మికుంట లో సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల నిర్వహణ

### ట్రస్ట్ చైర్మన్ రాముల కుమార్ వెల్లడి

జమ్మికుంట జూన్ 07 (ప్రజామంటలు):
జమ్మికుంట పరిసర ప్రాంత విద్యార్థులకు గొప్ప శుభవార్త సాహితీ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ రాముల కుమార్ తెలిపారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో విలేకరుల సమావేశం లో గార్డియన్ పాఠశాల కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా నడిచిన గార్డియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరోనా కాలంలో ఆగిపోవడం వలన సమాజంలో సేవ దృక్పథంతో ఆలోచన చేసి సాహితీ ఫౌండేషన్, గార్డియన్ పాఠశాలను దత్తత తీసుకొని ఈ విద్యా సంవత్సరం నుండి నర్సరీ నుండి 5వ తరగతి వరకు విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తామని తెలియజేశారు. జమ్మికుంట పరిసర ప్రాంత తల్లిదండ్రులు ఇట్టి సువర్ణ అవకాశంను వినియోగించుకొని మీ పిల్లలను చేర్పించే భాద్యత మీది, వారి భవిష్యత్తు ను తీర్చిదిద్దే భాద్యత మాది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ మహమ్మద్ అంకూస్, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## ప్రకృతి బీభత్సవానికి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

### ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ ఉద్యోగుల సేవలు

**భీమదేవరపల్లి జూన్ 07 (ప్రజామంటలు):**
ప్రకృతి బీభత్సవానికి రత్నగిరి గ్రామంలో గురువారం సాయంత్రం భారీ గాలి దుమారంతో కురిసిన వాన గ్రామస్తులను ఇబ్బందుల్లో పడేసింది. ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గ్రామంలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి, విద్యుత్ తీగలపై పడడంతో తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విద్యుత్ స్తంభాలపై పడడంతో ఒరిగిపోయాయి. అప్రమత్తమైన విద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గ్రామంలో సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో విద్యుత్ అధికారులు కష్టపడి పునరుద్ధరణ పనులను చేపట్టారు. రాత్రి వరకు విద్యుత్ పనులను పునరుద్ధరించారు. విద్యుత్ పునరుద్ధరణ పనులలో ఏఈ లక్ష్మణ్ నాయక్, లైన్ మెన్ శ్రీనివాస్, జూనియర్ లైన్ మెన్ ప్రకాష్, బొల్లంపల్లి శ్రీనివాస్, అమర్ పాల్గొన్నారు.

## గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు సూచనలు

### కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

**జగిత్యాల జూన్ 07 (ప్రజామంటలు):**
గ్రూప్ – 1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ క్రింద తెలిపిన సూచనలు తప్పనిసరిగా పాటించవలసి ఉంటుందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్–×సేవల దరఖాస్తుదారులకు నోటిఫికేషన్ నెం.02/2024 ద్వారా %వీ=% విధానంలో ప్రిలిమినరీ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్) 09/06/2024న ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలియజేయడం. అభ్యర్థులను ఉదయం 9:00 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రం గేట్ ఉదయం 10:00 గంటలకు మూసి వేయబడుతుంది మరియు ఉదయం 10:00 గంటల తర్వాత అభ్యర్థులెవరూ పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించడానికి అనుమతించబడరు. అభ్యర్థులు 01/06/2024 మధ్యాహ్నం 02:00 గంటల నుండి కమిషన్ వెబ్‌సైట్ https://www.tspsc.gov.in నుండి పరీక్ష ప్రారంభమయ్యే వరకు హాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్ ఫోన్లు, టాబ్లెట్‌లు, పెన్ డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు, వాచ్, మ్యాథమేటికల్ టేబుల్‌లు, లాగ్ బుక్‌లు, లాగ్ టేబుల్‌లు, వాలెట్, హ్యాండ్‌బ్యాగులు, జోలాలు, పౌచ్‌లు, రైటింగ్ ప్యాడ్‌లు, నోట్స్, చార్ట్‌లు, లూజ్ షీట్‌లు, వంటివి తీసుకు రాకూడదు. ఆభరణాలు లేదా ఏదైనా ఇతర గాడ్జెట్‌లు/ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు లేదా రికార్డింగ్ సాధనాలు వారి శరీరం లేదా పాకెట్‌లపై కట్టబడి ఉంటాయి. దానిని కలిగి ఉండటం వలన పరీక్ష/పరీక్షల అభ్యర్థిత్వం చెల్లుబాటు కాకుండా పోతుంది. అభ్యర్థులు బూట్లు ధరించకుండా చప్పల్ మాత్రమే ధరించాలని సూచించారు. అభ్యర్థులు పరీక్ష సమయం పూర్తయ్యే వరకు పరీక్ష హాలు నుండి బయటకు రావద్దని సమాచారం. పరీక్ష హాలు నుండి బయలుదేరే ముందు, అభ్యర్థి OMR జవాబు పత్రాన్ని ఇన్విజిలేటర్‌కు అందజేయాలి. అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష హాల్‌లో బయోమెట్రిక్ ఇన్విజిలేటర్‌ల ద్వారా అభ్యర్థుల బయోమెట్రిక్‌లను క్యాప్చర్ చేయడం ఉదయం 09.30 గంటలకు ప్రారంభమవుతుందని మరియు బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ ద్వారా తన బయోమెట్రిక్‌లను క్యాప్చర్ చేసే వరకు అభ్యర్థులెవరూ పరీక్ష హాల్ నుండి బయటకు వెళ్లకూడదని అభ్యర్థులకు తెలియజేయబడింది. ఎవరైనా అభ్యర్థి తన బయోమెట్రిక్‌లను ఇవ్వకపోతే, అతని/ఆమె %వీ=% జవాబు పత్రం మూల్యాంకనం చేయబడదు. అభ్యర్థులు తమ వేళ్లపై బయోమెట్రిక్‌ల రికార్డింగ్‌కు ఆటంకం కలిగించే మెహెందీ, తాత్కాలిక టాటూలు లేదా ఏదైనా అబ్స్ట్రక్టివ్ మెటీరియల్–కవర్‌లను కలిగి ఉండకూడదని సూచించారు. అభ్యర్థుల విలువైన వస్తువులు లేదా వస్తువులను భద్రపరచడానికి కమిషన్ ఎలాంటి క్లోక్ రూమ్/స్టోరేజీ సౌకర్యాన్ని అందించదని అభ్యర్థి గమనించాలి. అభ్యర్థుల సౌలభ్యం కోసం, సమయాన్ని అంచనా వేయడానికి ప్రతి అరగంట పూర్తయిన తర్వాత హెచ్చరిక బెల్ మోగించబడుతుందని సమాచారం. అభ్యర్థులు పరీక్ష హాల్ ఇన్విజిలేటర్ నుండి సమయాన్ని కూడా తెలుసుకోవచ్చు. అభ్యర్థులు లొకేషన్‌ను నిర్ధారించుకోవడానికి మరియు చివరి నిమిషంలో గందరగోళాన్ని నివారించడానికి పరీక్షకు కనీసం ఒక రోజు ముందు పరీక్షా కేంద్రాన్ని సందర్శించాలని సూచించడం ముఖ్యం. అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యే ముందు కమిషన్ వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్న హాల్ టికెట్ మరియు ఓ.ఎం.ఆర్. ఆన్సర్ షీట్ లోని సూచనలకు చదవాలని సూచించారు. తద్వారా వారి అభ్యర్థిత్వం తిరస్కరణ/ చెల్లుబాటు కాకుండా ఉంటుంది.

## మిషన్ భగీరథ, బడిబాట లపై అవగాహన సదస్సు



**చొప్పదండి జూన్ 07 (ప్రజామంటలు):**
మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సమావేశ మందిరం లో మండల ప్రజా పరిషత్ అద్యక్షులు చిలుక రవీందర్ అధ్వర్యంలో మిషన్ భగీరథ పై ఇంటింటి సర్వే మరియు బడిబాట కార్యక్రమము పై అవగాహన సధస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలను ఉద్దేశించి అద్యక్షులు చిలుక రవీందర్ మాట్లాడుతూ.... గత ప్రభుత్వం ప్రతి పల్లెకు,ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగు నీరందించాలనే సధుద్దేశంతో మిషన్ భగీరథ కార్యక్రమమును ఏర్పటు చేయడ%శీ% జరిగింది. అంతేకాకుండా ప్రతి ఊరికి నీళ్ల ట్యాంకులను నిర్మించి, పైప్ లైన్లను వేయించి కోట్లాది రూపాయలను వెచ్చించింది. ప్రస్తుతం ప్రతి ఇంటికి నీరందుతుందా, కొత్త కనెక్షన్లు అవసరమున్నాయా అనే విషయమై గ్రామ కార్యదర్శుల నేతృత్వంలో ఇంటింటి సర్వే చేపట్టడం జరుగుతుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాలు, గ్రామాలలో ఈ నెల 10 వ తేది నుండి పది రోజుల్లో ఇంటింటి సర్వే పూర్తి చేసి సమగ్ర నివేదికను అందజేయవలసిందిగా సూచించడం జరిగింది. కార్యక్రమములో బాగ%శీ%గా బడిబాట కార్యక్రమమును ఉద్దెసించి అద్యక్షులు మాట్లాడుతూ.... పిల్లల డ్రాపౌట్ లేకుండా మరియు బడి వయసు పిల్లలని ప్రయివేట్ స్కూల్స్ ల్లోకి వెళ్ళడానికి ప్రభావితులు కాకుండా ప్రభుత్వ పాఠశాలకు, అంగన్వాడిలకు తీసుకువచ్చే దిశగా అడుగులు వేసేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది. బడి బయట పిల్లలని,నూతన%శీ%గా బడిలో చేర్చే పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్చారని పిల్లలకు, వారి తల్లితండ్రుల కు అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని జూన్ 19 వరకు కొనసాగించాలనీ సూచించారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఓ వేణుగోపాలరావు, ఎంపిఓ రాజగోపాలరెడ్డి, ఎస్ బి ఎం. వేణు ప్రసాద్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాదేవి, ఇజిఎస్ ఇ.సి రాజు, అన్నీ గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామైక్య సంగాల అద్యక్షులు, ఆయా గ్రామ పంచాయతీ సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.

## బావుపేట్ గ్రామంలో బడిబాట కార్యక్రమం

### ప్రయివేట్ కు దీటుగా విద్యా బోధన

### ఇంటింటా ఉపాధ్యాయుల ప్రచారం

ఎల్కతుర్తి జూన్ 07 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండల పరిధిలోని బావుపేట్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల యొక్క తల్లిదండ్రులను కలిసి మాట్లాడి తమరి పిల్లలను అందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ప్రతి సబ్జెక్ట్ కు ఒక ఉపాధ్యాయుడు, మంచి అనుభవం కలిగిన ఉపాధ్యాయుల బృందం, ప్రయివేట్ కు దీటుగా విద్యా బోధన చేస్తామని, ఉచిత, విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్, పౌష్టికహారం, వారానికి మూడు గ్రుడ్ల తో పాటుగా నాణ్యమైన విద్య అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ ప్రియా, సునీత, రమాదేవి, రషీదా, శ్రీనివాస్, రవి కుమార్ పాల్గొన్నారు.



## రాష్ట్రమంత్రి ఉత్తంకుమార్ ను కలిసిన సద్దాం హుస్సేన్

వేలేరు జూన్ 07 (ప్రజామంటలు):
మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజి ల సందర్శనకు విచ్చేస్తున్న బారి నీటిపారుదల మరియు అభివృద్ధి శాఖమంత్రి కేప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి కాళేశ్వరం ప్రాజెక్ట్ సమీక్షా సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రాంష్ట అయిల్ గ్రోవర్స్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి , భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వారితో పాటు పాల్గొన్న వేలేరు ఉప సర్పంచ్ మండల యూత్ కాంంగెస్ పార్టీ అద్యక్షులు సద్దాంహుస్సేన్ మరియు మాజీ కార్పోరేటర్లు, కాంటెస్టెడ్ కార్పోరేటర్లు, డివిజన్ అద్యక్షులు హన్మకొండ, వేలేరు మండలాల అద్యక్ష కార్యదర్శులు అక్కల ప్రశాంత్, గంగుల రణధీర్ రెడ్డి, జెట్టి అరవింద్, కురుసపల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.



# విపణి



## మూడో రోజూ లాభాల జోరు..

**ముంబయి:**
ఎన్నికల ఫలితాల రోజు నాటి భారీ నష్టాల నుంచి స్టాక్ మార్కెట్ సూచీలు కోలుకున్నాయి. మూడోసారి ప్రధాని మోదీ అధికార పగ్గాలు చేపడుతుండడం, మరోవైపు ద్రవ్యోల్బణం కట్టడికి ఆర్‌బీఐ మరోసారి యథాతథ వైఖరి అనుసరించడంతో సూచీలు వరుసగా మూడో రోజూ దూసుకెళ్లాయి.
ప్రధానంగా రిలయన్స్, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్ వంటి షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. ఈ క్రమంలో సెన్సెక్స్ సరికొత్త గరిష్ఠాలను నమోదు చేసింది. నిఫ్టీ 23వేల ఎగువన ముగిసింది.
సెన్సెక్స్ 75,031.79 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 76,795.31 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాలను సూచీ నమోదు చేసింది. చివరికి 1618.85 పాయింట్ల లాభంతో 76,693.36 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 468.75 పాయింట్ల లాభంతో 23,290.15 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ
83.38గా ఉంది.
సెన్సెక్స్‌లోని 30 కంపెనీలూ లాభాల్లో ముగిశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, విప్రో, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ 79.92 డాలర్లు, బంగారం ఔన్సు 2,355 డాలర్ల వద్ద ట్రేడవుతువుతున్నాయి. హెరిటేజ్ ఫుడ్స్ షేర్లు శుక్రవారం మరో 10 శాతం లాభపడి 661.25 వద్ద, అమరరాజా బ్యాటరీస్ 9.75 శాతం పెరిగి 1402 వద్ద ముగిశాయి.

5 ఏళ్ల లోపు బాలల్లో 27 శాతం మందికి

## పోషకాహార లోపం

**20 ఆహార దారిద్ర్య దేశాల్లో 13 ఆఫ్రికాలోనే యూనిసెఫ్ నివేదిక వెల్లడి**

కాల్బుంగో (నైజీరియా):
ప్రపంచంలో అయిదేళ్లలోపు వయసు బాలల్లో 27 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, వారిలో అత్యధికులు ఆఫ్రికా ఖండ దేశాల్లోనే ఉన్నారని ఐక్యరాజ్య సమితి బాలల సంస్థ యూనిసెఫ్ తెలిపింది. 100 అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లోని బాలల స్థితిగతులను పరిశీలించి ఈ సంస్థ గురువారం నివేదిక విడుదల చేసింది. రోజులోనో, రెండు రోజుల్లోనో కనీసం ఒక్క పూట కూడా సరైన ఆహారానికి నోచుకోనివారెందరో ఉన్నారని వెల్లడించింది. ఇలాంటి ఆహారపరమైన దారిద్ర్యానికి లోనైన 20 దేశాల్లో 13 ఆఫ్రికాలోనే ఉన్నాయి. ప్రపంచంలో అయిదేళ్ల లోపు వయసువారిలో 27 శాతం మంది (18.1 కోట్ల మంది) ఆహార దారిద్ర్యంతో బాధపడుతున్నారు. ఆఫ్రికాలో పలు దేశాల్లో సాయుధ సంఘర్షణల వల్ల పెద్ద సంఖ్యలో జనం నిర్వాసితులవుతున్నారు. వాతావరణ మార్పుల వల్ల వర్షపాతం తగ్గిపోయి పంటలు పండటం లేదు. ఫలితంగా ఆహార ధరలు పెరిగి, ఆఫ్రికాలో బాలబాలికలు ఆహార దారిద్ర్యం బారిన పడుతున్నారు. తినడానికి తిండి లేక కృశించిపోతున్నారు. ఈ సమస్య తీవ్రమైతే బాలలు మరణించే ప్రమాదం 12 రెట్లు ఎక్కువ. ప్రోటీన్ లోపంతో వచ్చే క్వాషియోర్కర్ వ్యాధి చాలామందిని బలిగొంటోంది. పోషకాహార లోపం రోగనిరోధక వ్యవస్థను బలహీనపరచి పలు వ్యాధులకు లోనయ్యేట్లు చేస్తుంది. తీవ్ర ఆహార కొరతతో చాలామంది ఆఫ్రికా ప్రజలు ఆకులు, అలములను, మిడతలను తిని కడుపు నింపుకొంటున్నారు. నైజీరియా, సూడాన్‌లలో చాలామంది బాలలు ఆహారం లేక మరణిస్తున్నారు. ఆఫ్రికాలో అత్యంత అభివృద్ధి చెందిన దేశమైన దక్షిణాఫ్రికా ప్రపంచంలో అత్యంత అసమానతలకు ఆలవాలం కూడా. ఇక్కడ ప్రతి నలుగురు బాలల్లో ఒకరు ఆహార దారిద్ర్యానికి గురవుతున్నారు. ఈ దుర్భర పరిస్థితిని అధిగమించడానికి యూనిసెఫ్ కృషి మొదలుపెట్టింది. నైజీరియాలో సొంత పెరళ్లలోనే చిలగడ దుంప, కర్ర పెండలం, మొక్కజొన్న, చిరు ధాన్యాలు, కూరగాయల పెంపకంలో వేలాది మహిళలకు శిక్షణ ఇస్తోంది. వర్షాలు విఫలం కావడంతో ఇసుక సంచుల్లో ఈ మొక్కల పెంపకాన్ని నేర్పుతోంది. కోళ్లు, పశువుల పెంపకంలో మెళకువలనూ నేర్పుతోంది. పంటల వైవిధ్యీకరణ, ఆరోగ్య సేవకుల పనితీరుతో ప్రోత్సాహకాలను ముడిపెట్టడం వంటి విధానాల వల్ల పశ్చిమ, మధ్య ఆఫ్రికా దేశాలలో గడచిన పదేళ్లలో ఆహార దారిద్ర్యంతో బాధపడుతున్న బాలల సంఖ్య 42 శాతం నుంచి 32 శాతానికి తగ్గింది.

## కొందరు ఓట్లేస్తే.. ఇంకొందరు చెంప దెబ్బలు కొడుతున్నారు

### ఎంపీ సంజయ్ రౌత్



ముంబయి: బాలీవుడ్ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ ను గురువారం చండీగఢ్ విమానాశ్రయంలో మహిళా సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చెంపదెబ్బ కొట్టడంపై శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ శుక్రవారం స్పందించారు. "కొందరు ఓట్లు వేస్తే మరికొందరు తిడుతున్నారు, ఇంకొందరు కొడుతున్నారు. అసలేం జరిగిందో తెలియదు. రైతులు చేసిన ఆందోళనలో మా అమ్మ కూడా ఉందని కానిస్టేబుల్ చెప్పింది నిజమే అయ్యుండొచ్చు. కన్న తల్లిని ఏమైనా అంటే ఎవరికైనా కోపం వస్తుంది కదా. ప్రధానమంత్రి మోదీ చట్టబద్ధమైన పాలన ఉండాలని చెబుతుంటారు. అలా ఉన్నప్పుడు దానిని చేతుల్లోకి తీసుకోవద్దు ... దేశవ్యాప్తంగా ఆందోళనలు చేసిన రైతులంతా భారత మాత పిల్లలే. ఎవరైనా వారిని అవమానిస్తున్నారంటే అది ఆలోచించాల్సిన విషయమే. కంగనాపై దాడికి సానుభూతి తెలుపుతున్నాను. ఆమె ఇప్పుడు గౌరవనీయమైన ఎంపీ పదవిలో ఉన్నారు. ఎంపీపై దాడి చేయడం ఎలాగైతే సరైనది కాదో, అలాగే రైతులకు మర్యాద ఇవ్వకపోవడం సరైనది కాదు" అని సంజయ్ రౌత్ మీడియాతో అన్నారు. గురువారం విమానాశ్రయంలో భద్రతా తనిఖీ చేసుకొని ముందుకువెళుతున్న కంగనను అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ చెంపదెబ్బ కొట్టారు. గతంలో కేంద్రం చేసిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసనలను ఉద్దేశించి కంగన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో విమర్శలకు దారితీశాయి. వారు రూ.100 కోసం అక్కడ కూర్చున్నారని, నిజమైన నిరసనకారులు కారని ఆమె వ్యాఖ్యలు చేశారు. ఆ మాటలు తననెంతో బాధించాయని కానిస్టేబుల్ చెప్పారు. ఆ ఆందోళనలో తన తల్లి కూడా పాల్గొందని, వారు న్యాయం కోసం పోరాడుతుంటే కంగన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తనకు కోపం తెప్పించిందని ఆమె పేర్కొన్నారు. అనంతరం కంగనపై దాడి చేసినందుకు అధికారులు ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

## స్పోర్టీ లుక్‌తో మార్కెట్లోకి టాటా ఆల్ట్రోజ్ రేసర్ కారు..




ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లో కొత్త ఆల్ట్రోజ్ రేసర్‌ను తీసుకొచ్చింది. స్పోర్టీ లుక్‌లో తీసుకొచ్చిన ఈ కొత్త ఆల్ట్రోజ్ ధర రూ.9.49 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. ఆర్1, ఆర్2, ఆర్3 పేరుతో మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. బేస్ వేరియంట్‌తో పోలిస్తే ఆర్2 రూ.1 లక్ష అదనం కాగా.. ఆర్3 రూ.లక్షన్నర అధికం. ప్యూర్ గ్రే, అటామిక్ ఆరెంజ్ అవెన్యూ వైట్ రంగుల్లో లభ్యమవుతుంది. ఆల్ట్రోజ్‌లో ఎక్స్‌టీరియర్, ఇంటీరియర్ పరంగా చాలావరకు మార్పులు చేశారు. బ్లాక్ కలర్ బానెట్, రేసింగ్ లుక్ కోసం ఇచ్చిన చారలు కారుకు పూర్తిస్థాయిలో స్పోర్టీ లుక్‌ను తీసుకొచ్చాయి. వాయిస్ అసిస్టెడ్ సన్‌రూఫ్, 360 డిగ్రీల కెమెరా, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్‌తో ఈ కారును తీసుకొచ్చారు. 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌ను అమర్చారు. భద్రతాపరంగా ఏబీఎస్, ఎస్ఎస్‌సీ, ఆరు ఎయిర్‌బ్యాగులను అందిస్తున్నారు. ఇక ఇంజిన్ విషయానికొస్తే.. అల్ట్రోజ్ రేసర్ 1.2 లీటర్ 3 సిలిండర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో వస్తోంది. 118 బీహెచ్‌పీ, 170ఎన్ఎం టార్క్‌తో కూడిన 6 స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్‌తో ఈ కారును తీసుకొచ్చారు. క్రూయిజ్ కంట్రోల్, ప్రొజెక్టర్ హెడ్‌ల్యాప్, ఫాగ్ ల్యాంప్స్, డీ ఫాగర్‌ను స్టాండర్డ్‌గా ఇస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న హ్యుందాయ్ ఐ20 ఎన్ లైన్, మారుతీ సుజుకీఈ ఫ్రాంక్స్, టయోటా అర్బన్ క్రూయిజర్ టైజర్‌కు ఆల్ట్రోజ్ పోటీ ఇవ్వనుంది.

## భారత్‌లో వాట్సప్ బిజినెస్ అకౌంట్స్‌కుమెటా వెరిఫైడ్

భారత్‌లోని వాట్సప్ బిజినెస్ యూజర్ల కోసం వెరిఫైడ్ ప్రోగ్రామ్‌ను మెటా ప్రారంభించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్‌లో ప్రస్తుతం ఈ వెరిఫికేషన్ ఆప్షన్ ఉంది. అలాగే, వాట్సప్ బిజినెస్ యాప్ వాడే వారి కోసం గతేడాది సెప్టెంబర్‌లోనే మెటా వెరిఫైడ్ ప్రోగ్రామ్‌ను తీసుకొచ్చింది. తాజాగా భారత్ సహా బ్రెజిల్, ఇండోనేసియా, కొలంబియా దేశాల్లోని వాట్సప్ బిజినెస్ యూజర్ల కోసం దీన్ని అందుబాటులోకి తెచ్చింది.
అందరికీ సుపరిచితమైన బ్లూటిక్‌నే వెరిఫైడ్‌గా పేర్కొంటారు. ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో తరహాలోనే మర్చంట్స్ తమ వాట్సప్ బిజినెస్ అకౌంట్‌కు మెటా వెరిఫైడ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. దీన్ని తీసుకున్నవారికి బ్లూటిక్‌ను జారీ చేస్తారు. దీనివల్ల ఈ బిజినెస్ నేమ్‌తో వేరొకరు ఖాతా తెరవకుండా రక్షణ కల్పించడంతోపాటు, మార్కెటింగ్ అవసరాల కోసం వాట్సప్ ఛానెల్‌ను కూడా మెటా అందిస్తుంది. సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వాట్సప్ బిజినెస్ యూజర్లు వివిధ డివైజుల నుంచి లాగిన్ అవ్వడానికి వీలుంటుంది. దీంతోపాటు కస్టమర్లకు, వెండర్లకు కనిపించేలా వ్యాపార వివరాలతో కూడిన కస్టమ్ వెబ్‌పేజీని కూడా క్రియేట్ చేసుకోవచ్చు. వ్యక్తిగత ఫోన్ నంబర్‌ను ఇవ్వకుండానే కస్టమర్ సపోర్ట్‌కు నేరుగా కాల్ చేసుకునే సదుపాయంపై మెటా ప్రస్తుతం పనిచేస్తోంది. అలాగే, కామన్ క్వశ్చన్లకు మానవ ప్రమేయం లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సమాధానం ఇచ్చేలా కొత్త టూల్‌ను మెటా సైతం అభివృద్ధి చేస్తోంది. భవిష్యత్‌లో వెరిఫైడ్ బ్యాడ్జ్ కోసం మెటా కొంత మొత్తాన్ని వసూలు చేయనుంది. అయితే, ఎంత మొత్తం అనేది మాత్రం వెల్లడించలేదు.




## ఎయిర్‌టెల్ కస్టమర్లకు అదిరే ప్లాన్..

**టీ20 వరల్డ్ కప్.. ఎయిర్‌టెల్‌లో డిస్నీ హాట్‌స్టార్ కొత్త ప్లాన్లు**




టీ20 వరల్డ్ కప్ నేపథ్యంలో ఎయిర్‌టెల్ కొత్త రీఛార్జ్ ప్లాన్లను తీసుకొచ్చింది. ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్‌తో పాటు ఎక్స్‌ట్రీమ్ ఫైబర్ బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల కోసం వీటిని ప్రవేశపెట్టింది. డిస్నీ హాట్‌స్టార్‌తో (%ణఙంఅవఎం ఎశేర్ఘుతీ%) కూడిన ఈ ప్లాన్లు క్రికెట్ వీక్షించేవారిని దృష్టిలోఉంచుకొని రూపొందించినట్లు టెలికాం నిపుణులు తెలిపారు. అలాగే వరల్డ్ కప్ నేపథ్యంలో అమెరికా, కెనడాకు ప్రయాణించే వారి కోసం ప్రత్యేకంగా రోమింగ్ ప్లాన్లను కూడా తీసుకొచ్చింది.

**ప్రీపెయిడ్ ప్లాన్లు..**
ప్రీపెయిడ్ కస్టమర్లకు డిస్నీ హాట్‌స్టార్ ప్లాన్లు రూ.499తో ప్రారంభమవుతున్నాయి. వివిధ కాలపరిమితులు, డేటా లిమిట్స్‌తో మూడు ప్లాన్లను అందిస్తోంది. వీటిలో రూ.3,359 అత్యంత ఖరీదైనది. దీంట్లో ఏడాది సబ్‌స్క్రిప్షన్‌తో పాటు ఓటీటీ ప్రయోజనాలున్నాయి. అదనంగా ఎలాంటి రుసుము లేకుండానే ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లే ద్వారా మరో 20 ఓటీటీలను ఎంజాయ్ చేయొచ్చు.
రూ.499 ప్లాన్: 28 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 3జీబీ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్, మూడు నెలల కాలపరిమితితో డిస్నీ హాట్‌స్టార్, ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ సబ్‌స్క్రిప్షన్, అపోలో 24/7
రూ.869 ప్లాన్: 84 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 2జీబీ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్, మూడు నెలల కాలపరిమితితో డిస్నీ హాట్‌స్టార్, ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ సబ్‌స్క్రిప్షన్, అపోలో 24/7
రూ.3,359 ప్లాన్: 365 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 2.5జీబీ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్, ఏడాది కాలపరిమితితో డిస్నీ హాట్‌స్టార్, ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్‌లో ఎంపిక చేసుకున్న ఒక ఓటీటీ, అపోలో 24/7

**పోస్ట్‌పెయిడ్ ప్లాన్లు..**
ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ ప్లాన్లలో డిస్నీ హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ ఏడాది వరకు ఉంటుంది. మూడు నెలల ఎక్స్‌ట్రీమ్ ప్లే కూడా లభిస్తుంది. ఈ ప్లాన్లు 499తో ప్రారంభమవుతున్నాయి. బేసిక్ ప్లాన్‌లో ఎలాంటి యాడ్-ఆన్‌లు లేకుండా 75జీబీ డేటా లభిస్తుంది.
రూ.1,499 ప్లాన్‌లో 200 జీబీ, 4 యాడ్-ఆన్‌లుబీ రూ.1,199లో 150 జీబీ, 3 యాడ్-ఆన్‌లుబీ రూ.999లో 100జీబీ, 3 యాడ్-ఆన్‌లుబీ రూ.599లో 75జీబీ, ఒక యాడ్-ఆన్‌బీ రూ.499లో 75జీబీబీ రూ.399లో 40జీబీ డేటా లభిస్తుంది. ఒక్కో యాడ్-ఆన్‌తో 30జీబీ డేటా అదనంగా లభిస్తుంది. వీటన్నింటిలో ఏడాది కాలపరిమితితో డిస్నీ హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్ ఉంటుంది. అలాగే ఎక్స్‌ట్రీమ్ ప్లాన్‌ను సైతం ఆనందించొచ్చు.

**ఎక్స్‌ట్రీమ్ ఫైబర్ ప్లాన్లు..**
డిస్నీ హాట్‌స్టార్‌తో కూడిన ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ఫైబర్ ప్లాన్లు రూ.699 నుంచి ప్రారంభమవుతున్నాయి. వీటితో ఎయిర్‌టెల్ డిజిటల్ టీవీ స్మార్ట్ బాక్స్ ద్వారా 350 టీవీ ఛానళ్లను కూడా వీక్షించొచ్చు. ఎక్స్‌ట్రీమ్ ప్లే సబ్‌స్క్రిప్షన్ కూడా ఉంది. డేటా స్పీడ్‌ను బట్టి 40 ఎంబీపీఎస్ నుంచి 1 జీబీపీఎస్ వరకు మొత్తం ఆరు ప్లాన్లు ఉన్నాయి. వీటిలో అత్యంత ఖరీదైనది రూ.3,999 ప్లాన్.
విదేశాలకు ప్రయాణించే వారి కోసం ఎయిర్‌టెల్ కొత్త ఇంటర్నేషనల్ రోమింగ్ ప్లాన్లను తీసుకొచ్చింది. ఇవి ఇన్-ఫ్లైట్ కనెక్టివిటీతో రూ.133 నుంచి ప్రారంభమవుతున్నాయి.

## యూపీఐ లైట్ బ్యాలెన్స్ ఇక ఆటో లోడ్..



ముంబయి: చిన్న మొత్తాల్లో చేసే డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరో కీలక నిర్ణయం తీసుకుంది. యూపీఐ లైట్‌లో ఆటోమేటిక్‌గా సొమ్ములు లోడ్ చేసుకునే సదుపాయాన్ని ప్రతిపాదించింది. దీనివల్ల ఈ విధానంలో చెల్లింపులు మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో పాటు ఫాస్టాగ్‌కు కూడా ఇదే విధానాన్ని ఆర్‌బీఐ సూచించింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ కు చెందిన సులభతరమైన వెర్షనే ఈ యూపీఐ లైట్. వ్యాలెట్‌లా ఇది పనిచేస్తుంది. దీంతో చేసే చెల్లింపులకు పిన్ అవసరం లేదు. దీనిలో గరిష్ఠంగా రూ.2000 వరకు లోడ్ చేసుకోవచ్చు. ఒకరోజులో రూ.2 వేలు మాత్రమే లావాదేవీలు చేయాల్సి ఉంటుంది. ఒకసారి గరిష్ఠంగా రూ.500 మాత్రమే పేమెంట్ చేయగలం. ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష నిర్ణయాల వెల్లడిలో భాగంగా యూపీఐ లైట్‌లో కొన్ని మార్పులు చేస్తున్నట్లు గవర్నర్ శక్తికాంత్ దాస్ ప్రకటించారు. దీని వినియోగాన్ని మరింత విస్తృత పరిచేందుకు ఇ-మ్యాండేట్ విధానాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఇందులో నిర్దిష్ట లిమిట్ కంటే సొమ్ములు తగ్గినప్పుడు ఆటోమేటిక్‌గా బ్యాంక్ అకౌంట్ నుంచి ఫండ్స్ లోడ్ అవుతాయి. లిమిట్‌ను యూజర్లే సెట్ చేసుకోవాల్సి ఉంటుంది. చిన్న చిన్న లావాదేవీలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. రికరింగ్ పేమెంట్స్‌కు ఇ-మ్యాండేట్ వాడకం పెరిగిందని ఈ సందర్భంగా దాస్ చెప్పారు. ఇందులో భాగంగా ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ వంటి వాటికి కూడా ఆటో లోడ్ సదుపాయాన్ని ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. యూజర్ సెట్ చేసుకున్న పరిమితి కంటే నిధులు తగ్గినప్పుడు ఇ-మ్యాండేట్ సదుపాయం ద్వారా ఆటోమేటిక్‌గా ఫండ్స్ లోడ్ అవుతాయి. దీనివల్ల ప్రయాణంలో అవరోధాలు ఉండబోవని పేర్కొన్నారు.

# NATIONAL International



## ఇకపై రూ.3 కోట్ల వరకు రిటైల్ డిపాజిట్టే

**ముంబయి:**
బల్క్ ఫిక్స్‌డ్ డిపాజిట్ నిర్వచనాన్ని సవరించాలని 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించింది. రూ.3 కోట్లు ఆపై చేసే మొత్తాన్ని ఈ పరిధిలోకి తీసుకురానున్నట్లు తెలిపింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలకు త్వరలోనే జారీ చేస్తామని గవర్నర్ శక్తికాంతదాస్ శుక్రవారం ప్రకటించారు. ప్రస్తుతం రూ.రెండు కోట్లు ఆపైన చేసే మొత్తాన్ని బల్క్ డిపాజిట్‌గా పరిగణిస్తున్నారు. ఇకపై రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను సైతం రిటైల్ ఎఫ్‌డీగానే లెక్కలోకి తీసుకుంటారు. సాధారణంగా బ్యాంకులు రిటైల్‌తో పోలిస్తే బల్క్ ఎఫ్‌డీలపై తక్కువ వడ్డీ రేటును ఆఫర్ చేస్తుంటాయి. తాజా నిర్ణయం ఎఫ్‌డీల్లో ఇన్వెస్ట్ చేసే వారికి శుభవార్తనే చెప్పాలి. గతంతో పోలిస్తే రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ లభించనుంది. కొన్ని బ్యాంకులు కాల వ్యవధిని బట్టి బల్క్ డిపాజిట్లపై కూడా ఆకర్షణీయ మైన వడ్డీరేటును అందిస్తున్నాయి. కొత్త మార్పు షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు వర్తించనున్నాయి. మరోవైపు 'రీజినల్ రూరల్ బ్యాంకుల విషయంలో రిటైల్ డిపాజిట్ల పరిమితి రూ.కోటికి పెంచారు. ఆర్‌ఆర్‌బీల్లో రూ.1 కోటి, ఆపై మొత్తాన్ని బల్క్ ఎఫ్‌డీ పరిగణిస్తారు.

# సీడబ్ల్యూసీ భేటీ కోసం ఢిల్లీకి వెళ్లిన సిఎం రేవంత్


## రాష్ట్ర వ్యవహారాలపై కాంగ్రెస్ పెద్దలతో సమాలోచన



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీకి వెళ్లారు. శనివారం దిల్లీలో జరిగే సీడబ్ల్యూసీ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలతో సీఎం సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు మంత్రివర్గ విస్తరణ జరగలేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ఈ అంశంపై చర్చించే అవకాశం ఉంది. అలాగే నామినేటెడ్ పోస్టుల భర్తీ, పీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపిక తదితర విషయాలపై చర్చిస్తారని సమాచారం. సీడబ్ల్యూసీ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ కూడా పాల్గొననున్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు వంశీచంద్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ హాజరు కానున్నారు.

# ధనవంతుల జాబితాలో ఇద్దరూ ఇద్దరే

### తెలుగు రాష్ట్రాల్లో రిచెస్ట్ ఎంపిలు వారే - పెమ్మసాని, కొండాల ఆస్తులు అనంతం





హైదరాబాద్, (ప్రజా మంటలు): మన దేశంలోని కొత్తగా ఎన్నికైన ఎంపీల్లో అందరికన్నా ధనవంతులు తెలుగు రాష్ట్రాల్లోనే ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసినప్పుడు ఆయా అభ్యర్థులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అత్యంత ధనవంతుడిగా గుంటూరుకు చెందిన టీడీపీ నేత పెమ్మసాని చంద్రశేఖర్ నిలిచారు. ఆ తర్వాతి స్థానంలో తెలంగాణకు చెందిన బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఉన్నారు. తాజాగా ముగిసిన లోక్ సభ ఎన్నికల్లో వీరు ఇద్దరూ గెలవడంతో అత్యంత ధనవంతుడైన ఎంపీగా పెమ్మసాని నిలవగా.. బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి రెండో స్థానంలో ఉన్నారు. ఇటీవల జరిగిన ఏపీ ఎన్నికలలో టీడీపీ కూటమి విజయం సాధించింది. 164 అసెంబ్లీ, 21 ఎంపీ సీట్లు కైవసం చేసుకుంది. గుంటూరులో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన పెమ్మసాని చంద్రశేఖర్ గెలవడంతో దేశంలోనే ఆయన అత్యంత ధనిక ఎంపీగా నిలిచారు. ఆయన తన ఆస్తులను రూ. 5,705 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్ లో ప్రకటించారు. పెమ్మసాని ప్రొఫెషన్ డాక్టర్. అయితే, ఆయన ఇలా రూ.వేల కోట్లకు ఎలా అధిపతి అయ్యారనేది అందరిలోనూ ఆసక్తిగా మారింది. పెమ్మసాని తన అఫిడవిట్ లో పేర్కొన్న వివరాల ప్రకారం.. తన పేరుపై ఉన్న ఆస్తులు రూ.2 వేల కోట్ల పైచిలుకే. తన భార్య కోనేరు శ్రీరత్న పేరు మీద మరో రూ.2 వేల కోట్ల పైనే ఆస్తులు ఉన్నాయి. కుమారుడు అభినవ్ పేరు మీద దాదాపు రూ.500 కోట్ల ఆస్తులు.. కుమార్తె సహస్రకు మరో రూ.500 కోట్ల దాకా ఆస్తులు ఉన్నట్లు పెమ్మసాని అఫిడవిట్‌లో బయటపెట్టారు. ఇవికాక, రూ.72 కోట్ల విలువైన భూములు, బిల్డింగులు, తన భార్య పేరు మీద రూ.34.82 కోట్ల విలువైన భూములు ఉన్నట్లు పేర్కొన్నారు. ఓ రైతు కుటుంబానికి చెందిన పెమ్మసానికి ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయనేది ఆసక్తిగా మారింది. పెమ్మసాని చంద్రశేఖర్ కు అన్ని ఆస్తులు ఎలా వచ్చాయనే విషయం ఆయనే కొన్ని ఇంటర్వ్యూల్లో చెప్పారు. తెనాలి సమీపంలోని బుర్రిపాలెం సొంతూరు. మధ్య తరగతి కుటుంబంలోనే జన్మించారు. డాక్టర్ కావాలనే ఉద్దేశంతో 1993-94లో ఉస్మానియాలో సీటు సాధించారు. కష్టపడి చదువుకుని విదేశాలకు వెళ్లి.. అక్కడ తన ప్రతిభతో బిజినెస్‌లు చేశారు. 2000 ఏడాదిలో అమెరికాకు వెళ్లి.. జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీలో ఐదేళ్లపాటు మెడికల్ టీచింగ్ ఫ్యాకల్టీగా ఉండేవారు. తాను సొంతంగా తయారు చేసిన మెడికల్ నోట్స్‌ను తక్కువ ధరకు ఆన్ లైన్‌లో అందించేవారు. అలా ఆదరణ బాగా దక్కింది. అలా యూ వరల్డ్ ఆన్‌లైన్ ట్రైనింగ్ సంస్థను పెమ్మసాని మొదలుపెట్టారు. దీని ద్వారా నర్సింగ్, ఫార్మసీ, లా, బిజినెస్, అకౌంటింగ్ విభాగాల్లో లైసెన్సింగ్ పరీక్షలకు ట్రైనింగ్ ఇచ్చేవారు. పెమ్మసాని ఫౌండేషన్ ను ఏర్పాటు చేసి ఎన్నారైలకు ఫ్రీగా వైద్య సేవలు అందించేవారు. వైద్య రంగం, దాని అనుబంధ రంగాల్లో అత్యధిక వ్యాపారాలు చేస్తున్నారు. తెలంగాణ నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర రెడ్డి రూ.4,568 కోట్లతో రెండో ధనిక ఎంపీగా నిలిచారు. ఈయన కొండా వెంకట రంగారెడ్డి మనుమడే కాక, అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు ప్రతాప్ సి.రెడ్డికి అల్లుడు. ఈయన 2024 ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తులు కూడా భారీగా పెరిగాయి. తాను గత పదేళ్ల క్రితం అఫిడవిట్ వివరించిన ఆస్తులకు, ఇప్పటికి చాలా పెరుగుదల ఉంది. 2019లో కూడా కొండా ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడారు. అప్పటి అఫిడవిట్ లో తన ఆస్తులు రూ.895 కోట్లు అని అఫిడవిట్ లో పేర్కొన్నారు. 2014లో టీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచినప్పుడు తన ఆస్తులను రూ.528 కోట్లుగా వెల్లడించారు. 2019లో పోలిస్తే ఈ 5 ఏళ్ల వ్యవధిలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆస్తుల విలువ 410 శాతం పెరిగినట్లుగా అర్థం అవుతోంది. చేవెళ్ల బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన కొండా విశ్వేశ్వర్ రెడ్డికి అత్యధిక శాతం మెడికల్ రంగంలోనే చాలా పెట్టుబడులు ఉన్నాయి. కొండా విశ్వేశ్వర్ పేరు మీద రూ.1,178.72 కోట్ల ఆస్తులు, ఆయన భార్య సంగీత రెడ్డి పేరు మీద రూ.3,203.90 కోట్ల మేర ఆస్తులు ఉన్నాయి. అపోలో ఆసుపత్రిలోనే ఎకంగా రూ.2,577 కోట్ల విలువైన షేర్లు ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో 85 ఎకరాల వ్యవసాయ భూమి, చేవెళ్ల, హైదర్షాకోట్, స్నేహిత హిల్స్‌లో సాధారణ భూములు, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో కమర్షియల్ భవనాలు వీరికి ఉన్నాయి. ఇంకా మరెన్నో ఆస్తులు ఉన్నాయి.

# నీట్ ఫలితాల్లో అవకతవకలపై విచారణకు ఆదేశించాలి

### - కాంగ్రెస్ కార్యదర్శి ప్రియాంక డిమాండ్



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): నీట్-2024 ఫలితాల్లో అవకతవకలు చోటుచేసుకున్నా యని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆరోపించారు. దీనిపై వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని వెంటనే దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. తొలుత నీట్ ప్రశ్నాపత్రం లీకైందన్న ఆమె... ఇప్పుడు ఫలితాల్లోనూ కుంభకోణం జరిగినట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. ఈమేరకు తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు ఆమె చెప్పారు. వీటన్నింటినీ నివృత్తి చేయాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మరోవైపు నీట్ ఫలితాల వెల్లడి తర్వాత పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటంపై ప్రియాంక దిగ్భ్రాం÷-రతి వ్యక్తంచేశారు. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణలపై అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ' లక్షలాది మంది విద్యార్థుల గోడును ఈ ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తోంది. నీట్ పరీక్ష ఫలితాల్లో అవకతవకలు జరిగాయని పదేపదే మొత్తుకుంటున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు. దర్యాప్తు చేపట్టి వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా?' అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. నీట్ పరీక్ష ఫలితాలపై పలువురు అభ్యర్థులు, తల్లిదండ్రులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. జూన్ 4న వెలువడిన నీట్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. అందులో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి 720కి 720 మార్కులు రావడం గమనార్హం. మరోవైపు నీట్ పరీక్ష పేపర్ లీకైనట్లు వార్తలు గుప్పుమన్నాయి. అయితే, దీనిని తప్పుడు ప్రచారంగా ఎన్‌టీఏ కొట్టి పారేసింది. మే 5న సాయంత్రం 4 గంటల సమయంలో ప్రశ్నపత్రం ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ సమయానికే దేశవ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో పరీక్ష మొదలైపోయిందని, అందువల్ల ప్రశ్నపత్రం లీక్ కాలేదని క్లారిటీ ఇచ్చింది.

# మోడీ ఏక ఛత్రాధిపత్యానికి ఇక చెక్

### ఉమ్మడి పాలనలో ఏకపక్ష నిర్ణయాలు చెల్లవ్

### ఇప్పటికైనా మార్పుతో బిజెపి మారాలి



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): దేశంలో అప్రతిహత నేతగా, తిరుగులేని నేతగా గణతికెక్కిన నరేంద్ర మోడీ ప్రధానిగా మనుగడ కోసం ఇతరులపై ఆధారపడవలసిన స్థితి వచ్చింది. భారత ప్రజాస్వామిక చైతన్యం కారణంగానే ఇలా జరిగింది. ఎంతటి వారైనా ప్రజల ముందు దిగదుడుపే అని నిరూపించిన సదర్భం ఇది. మోడీనే మోసి అలసిపోయిన బిజెపి నేతలకు కలలోనైనా ఊహించలేని పరిణామం ఇది. దేశవ్యాపితంగా ఏ ఒక్క ఎగ్జిట్ పోల్ కూడ చెప్పని స్థాయి లోకి ఆయనను, ఆయన పార్టీని పడగొట్టిన శక్తి ప్రజలదే. ప్రజలను కలవకుండా, ప్రతిపక్షాలతో చర్చించకుండా, పార్టీకి చెప్పకుండా తనకుతోచిన విధంగా ముందుకు సాగుతున్న తీరును ప్రజలు ఈసడించుకున్నారు.ఇక ఈ ఎన్నికల్లో మరో కీలక పరిణామం బిఆర్ఎస్, బిఎస్‌పి రాజకీయ చిత్రం నుంచి అదృశ్యమయ్యాయి. బిఆర్ఎస్‌గా మారి దేశ రాజకీయాలనే ప్రభావితం చేస్తామన్న కెసిఆర్ స్వంత నియోజకవర్గం లాంటి మెదక్ కూడా గెలవలేకపోయారు. అన్నాడిఎంకె కూడా మొత్తంగా మాయమైపోయింది. ఒడిషాలో బిజెడి కూడా బిజెపి విషయంలో ఊగిసలాడి చివరకు అధికారం పోగొట్టుకోవడమే గాక లోక్‌సభ ప్రాతినిధ్యం కూడా పోగొట్టుకుంది. ఉద్యమాలకూ ఎన్నికలకూ సంబంధం వుండదనే సిద్దాంతాలు కూడా ఈ ఫలితాలతో తారుమారైనాయి. రైతాంగ ఉద్యమం నడిచిన చోట్ల బిజెపికి తీవ్రమైన దెబ్బ తగిలింది. మొత్తంగా వాతావరణంలో మార్పు తేవడంలోనూ ఆ ప్రభావం పడింది. రాజస్థాన్, హర్యానా, పంజాబ్, యు.పి, పశ్చిమ ప్రాంతంలో బిజెపి ఓటమికి ఈ ఉద్యమమే కారణంగా భావిస్తున్నారు. రాజ్యాంగం, రిజర్వేషన్లు, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం వంటి అంశాలను చర్చలోకి తేవడానికి ఆ వర్గాలను ఆకర్షించడానికి కారణమైనాయి. మైనార్టీలలో వచ్చిన మార్పు యు.పి ఫలితంలో కీలక పాత్ర వహించింది. ఏక వ్యక్తి కేంద్రంగా పని చేసే మోడీ మిశ్రమ ప్రభుత్వాన్ని నడపగలరా అనే సందేహాలు కూడా మీడియా బాహాటంగానే వ్యక్తం చేసింది. కార్పొరేట్ శక్తులు తమ ప్రయోజనాల కోసం ఎంతైనా ఒత్తిడి తెస్తుంటాయి. భారత రాజ్యాంగ రక్షణ అనే అంశాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని కాంగ్రెస్ చేసిన ప్రచారాన్ని ప్రజలు బలంగా నమ్మారు. దేశ చిత్రపటాన్ని మోడీ ముఖచిత్రంగా మార్చేసిన వైపరీత్యానికి తెర దిగింది. ఓ రకంగా చెప్పాలంటే పార్లమెంటులో ప్రజల తీర్పు మోడీ నైతిక పరాజయంగా చూడాలి. ఫాసిస్టు తరహా పాలనకు వ్యతిరేకంగా ప్రజల తీర్పుగా దీన్ని చూడాలి. దేశంలో ప్రజాస్వామిక విలువలను గౌరవించాలని తేల్చిచెప్పారు. ఇండియా' వేదికలో 99 స్థానాలతో కాంగ్రెస్ దాదాపు 40 శాతం ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఈ విధమైన పరిస్థితి వస్తుందని కమలనాథులు ముందుగా ఊహించలేదంటే వారు నేలవిడిచి సాము చేశారని చెప్పాలి. రాజ్యాంగం రాష్ట్రాల హక్కులు, లౌకిక తత్వం, రైతాంగ ఉద్యమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలు కాకుండా కేవలం వ్యక్తిగతమైన, ఉద్వేగ భరితమైన అంశాలే ఓటర్లను నడిపిస్తాయనే అంచనాతో ఎన్నికల్లోకి వెళ్లిన బిజెపిని గట్టి దెబ్బ కొట్టారు. ఓటర్ల తీర్పు చూస్తే ఇవన్నీ ప్రభావం చూపించాయని అర్థమవుతుంది. త్తరాన, పశ్చిమాన బిజెపి ప్రాబల్యం తగ్గలేదనీ దక్షిణాన, తూర్పున మాత్రమే ఇతరుల ప్రభావం అధికమని భావింఇన వారికి కూడా ఈ ఫలితాలు చెంపదెబ్బలాంటివి. ఉత్తర భారతంలో మోడీ స్వయంగా పోటీ చేయడమే గాక ఆయనతో దీటైన ప్రధాని అభ్యర్థిగా చలామణి అయ్యే యోగి ఆదిత్యనాథ్ పాలించే యు.పి లో బిజెపి ఘోరంగా దెబ్బతిన్నది. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ట ప్రచారం, ప్రతిపక్షాలు వ్యతిరేకమనే ముద్ర ఆదుకోలేక పోయింది. యు.పి లో ప్రతిపక్షాల ముందు బిజెపి నిలువలేకపోయింది. గతంలో దానికి స్వంతంగా 62 స్థానాలు వస్తే ఈ సారి 33కు పడిపోయాయి. గతంలో అయిదు స్థానాలే వచ్చిన ఎస్.పి ఇప్పుడు 37తో మొదటి స్థానంలోకి వచ్చింది. ములాయం మరణానంతరం అఖిలేష్ యాదవ్ నాయకత్వంలో ఇదే పెద్ద విజయం. బిఎస్‌పి వేరుగా పోటీ పెట్టి పూర్తిగా ఓడిపోయినా దాని వల్లనే 16 స్థానాలు బిజెపికి పోయాయి. లేకపోతే ఈ సంఖ్య మరింత అధికంగా వుండేది. బీహార్‌లోనూ కొంత ఫలితం వచ్చింది. ఇక బిజెపి కుట్రలతో ప్రలోభాలతో ప్రాంతీయ పార్టీలన్నిటినీ చీల్చిన మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సిపి, కాంగ్రెస్ కూటమి పైచేయి సాధించి సీట్లు తెచ్చుకున్నది. బిజెపి 9 సీట్లకు పరిమితమైంది. మొత్తంపైన గతంలో దక్షిణాన 30 సీట్లు వుంటే ఇప్పుడు 41కి చేరాయి. మరో వంక 'ఇండియా' కు గతంలో 58 వుంటే ఇప్పుడు 74కు చేరాయి. ఇక తూర్పున ఒడిషాలో అధికారం, ఆధిక్యత రెండూ దక్కినా బెంగాల్‌లో బిజెపి గతంలోని స్థానాలు 12కు తగ్గాయి. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్ లలో బిజెపితో ముఖాముఖి పోటీలో కాంగ్రెస్ స్థానాలు గతంలో కంటే బాగానే పెరిగాయి. రాహుల్ గాంధీ యాత్రలు, కార్యక్రమాలు పార్టీలో కదలిక తేవడమే గాక ఆప్ కూడా కూటమితో కలసి రావడం తోడైంది. బీహార్‌లో ఆర్జేడి కూడా ముఖ్య పాత్ర వహించింది. ఈ విధంగా మొత్తంపైన ఎవరూ ఊహించని విధంగా 'ఇండియా' వేదిక బిజెపి, ఎన్‌డిఎకు దీటుగా నిలిచిందంటే ప్రజల మద్దతే కారణం.

# కులగణన చేయాలని మోడీని కోరుతా

### అవసరమైతే ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలుస్తా

### మాజీ ఎంపి విహెచ్ వెల్లడి



హైదరాబాద్, (ప్రజా మంటలు): కులగణన చేపట్టాలని ప్రధాని మోడీని కోరుతానని కాంగ్రెస్ సీనియర్ నేత కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. ఈ మేరకు ఢిల్లీకి వెళ్లి మరోసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి కులగణన చేయాలని డిమాండ్ చేస్తానని వి.హనుమంతరావు అన్నారు.కేంద్రంలో మూడోసారి ఎన్డీఏ గెలవడంతో మరోసారి మోదీకి ప్రజలు అవకాశం ఇచ్చారని.. ఓటర్ల తీర్పును గౌరవిస్తామన్నారు. మోదీ ఓబీసీ ప్రధాని కానీ బడుగు బలహీనర్గాల సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. రిజర్వేషన్‌లో 50 శాతం సిలింగ్ ఎత్తివేస్తామని అన్నారన్నారు. ఈరోజు ఎన్డీఏ కూటమి కీ రోల్‌లో జేడీయూ అధినేత నితీష్ కుమార్, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఉన్నారని చెప్పారు. మోదీ వారికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. బీహార్‌లో నితీష్ కులగణన చేస్తే 67 శాతం రిజర్వేషన్ బీసీలకు వచ్చిందన్నారు. రాహుల్ గాంధీ చేసిన ఆలోచనను మోదీ కొనసాగించాలని కోరారు. ఓబీసీ కన్వీనర్‌గా తాను ఉండి రిజర్వేషన్ పెంచాలని మోదీని గతంలో కోరానని గుర్తుచేశారు. ఐఐటీలో కూడా రిజర్వేషన్ కోసం అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని.. బిల్ పాస్ అయిందని తెలిపారు. మాండల్ కమిషన్ వచ్చింది కానీ బీసీలు చట్ట సభల్లో డబుల్ డిజిట్ కూడా దాటడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నితీష్, చంద్రబాబులు కూడా అన్ని రాష్టాల్లో కుల గణన చేయాలని మోదీని కోరాలన్నారు. స్వాతంత్య్రం వచ్చి 70ఏళ్లు అవుతున్న బీసీలకు న్యాయం జరగడం లేదన్నారు. తెలంగాణలో కులగణన తర్వాత లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహిస్తే.. బీసీలకు మేలు జరుగుతుందని.. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కొంత ఆలస్యమైన కులగణన తర్వాతే రాష్ట్రంలో ఎన్నికలు పెట్టాలని కోరారు. అసెంబ్లీలో కులగణన బిల్లు పాస్ చేయించిన వెంటనే కులగణనను అమల్లోకి తీసుకురావాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్‌లు మోదీకి వేంకటేశ్వర స్వామి విగ్రహం అందజేశారని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా హామీని మోదీ ఇచ్చారని.. దానిని పట్టుబట్టి అమలు చేయించాలని కోరారు. మూడోసారి ఓబీసీ ప్రధానిగా మోదీ అవుతున్నారు కాబట్టి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలు.. సెన్సెక్స్ మీద ప్రభావం చూపాయని హనుమంతరావు పేర్కొన్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com